
ఈనాడు
తిరుపతి
సోమవారం అక్టోబరు 7, 2024





స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు



ముత్యాలపందిరిపై విహరిస్తూ..

సింహాసనాన.. ముత్యాలమేనా

బ్రహ్మోత్సవాల్లో మూడో రోజు వైభవం



తిరుమల, న్యూస్‌టుడే: సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి ఆదివారం సింహ, ముత్యపు పందిరి వాహన సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం మలయప్ప స్వామివారు యోగనరసింహుని అలంకారంలో దర్శనమిచ్చారు. వాహనం ముందు గజ రాజులు నడుస్తుండగా శ్రీవారు దుష్ట శిక్షణ, శిష్టరక్షణ కోసం సింహంపై కూర్చుని ఊరేగారు. సింహం పరాక్రమానికి, ధైర్యానికి, తేజస్సుకు, ఆధిపత్యానికి, మహాధ్వనికి సంకేతం. రాత్రికి ముత్యపు పందిరి వాహనంపై శ్రీదేవి, భూదేవితో కలిసి బకాసుర వధ అలంకారంలో భక్తులను కనువిందు చేశారు. ఈ దర్శనం తాపత్రయాలను పోగొట్టి, భక్తుల జీవితాలకు చల్లదనాన్ని చేకూరుస్తుందని విశ్వాసం. తితిదే ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో నిర్వహించిన కళా ప్రదర్శనలు భక్తులకు ఆధ్యాత్మికానందం కలిగించాయి.

నేటి వాహన సేవలు

బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన సోమవారం ఉదయం 8-10 గంటల వరకు కల్పవృక్ష వాహనసేవ, మధ్యాహ్నం 1-3 గంటల వరకు స్నపన తిరుమంజనం, రాత్రి 7-9 గంటల వరకు సర్వభూపాల వాహన సేవ జరగనుంది.





గరుడ సేవకు విస్తృత ఏర్పాట్లు

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం జరిగే గరుడ వాహన సేవలను దాదాపు రెండు లక్షల మంది భక్తులు గ్యాలరీల్లోంచి వీక్షించేలా ఏర్పాట్లు చేసినట్లు తితిదే ఈవో జె.శ్యామలరావు తెలిపారు. అంతర్గత రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్డులో వేచిఉండే భక్తులకు సుపథం, సౌత్ వెస్ట్ కార్నర్, గోవిందనిలయం నార్త్‌వెస్ట్ కార్నర్, నార్త్ ఈస్ట్ గేట్ల ద్వారా దర్శనం కల్పిస్తామన్నారు. భక్తులు లగేజీ లేకుండా క్యూలైన్‌లో ప్రవేశించాలని సూచించారు.














ఐదేళ్లూ ఉచిత ప్రచార దందా

- తిరుపతిలో వైకాపా నేతల దాష్టీకాలు
- సగానికి సగం పడిపోయిన ఆదాయం

రూ.లక్షల విలువైన ప్రచారం.. అయినా అక్కడ ఉచితమే. అధికారుల అనుమతి అక్కర లేదు. సొంత పైసాతో పనిలేదు. నేతల ఫొటోలతో నగర కూడళ్లు నిండిపోయేవి.. బ్యానర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, క్యాంటీలివర్లు, లాలీపాప్ బోర్డులు రాత్రింబవళ్లు ధగధగలాడేవి. ఐదేళ్లూ స్వప్రయోజనాల కోసం నగరపాలిక ఆదాయానికి పెద్దఎత్తున గండికొట్టిన వైకాపా నేతల ఆగడాలు వెలుగు చూస్తుండటంతో నగరవాసులు నివ్వెరపోయారు.

- న్యూస్‌టుడే, తిరుపతి (నగరపాలిక)

- వైకాపా హయాంలో తానో కీలకనేత అని ప్రకటించుకున్న ఓ వ్యక్తి ఇటీవల జనసేనలో చేరారు. ఐదారు గురితో పార్టీలో చేరిన ఆయన ముందురోజు పలు ప్రకటనల ఏజెన్సీలకు ఫోన్‌చేసి ఫలానా ప్రాంతంలో తన నిలువెత్తు కటౌట్లు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇప్పుడు తాను జనసేన నేత కాబట్టి ఎటువంటి రుసుములు ఇవ్వలేను.. అన్నతో చెప్పి ఏదైనా పని చేయిస్తా. ప్రింటింగ్ ఖర్చులు, కూలి ఖర్చులూ మీరే భరించాలని సెలవివ్వగా చేసేది లేక ఆయన కోరినన్ని చోట్ల కాకుండా పరిమిత సంఖ్యలో ఫ్లెక్సీలు వెలిశాయి.
- గత ప్రభుత్వ హయాంలో తిరుపతి గంగజాతర, నగర ఆవిర్భావ వేడుకలు, కబడ్డీ పోటీలు, నేతల పుట్టిన రోజులు, పండుగలు, పబ్బాల పేరుతో నగరం మొత్తం వేలాది బ్యానర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లతో నింపేవారు. ఆ సమయంలో నిర్వాహకులకు చెల్లించిన రుసుములు గురించి ఆరాతీస్తే అవన్నీ ఉచిత సేవలే అని స్పష్టమైంది. బెదిరించి ఊరంతా బ్యానర్లు కట్టించుకున్న వైనంపై ఇప్పుడు నోరు విప్పుతున్నారు. ఉచిత సేవలకు నజరానాగా ఐదేళ్లూ నగరపాలక సంస్థకు, ప్రకటన సంస్థలు రుసుములు చెల్లించాల్సిన అవసరం లేకుండా సహకరించినట్లు సమాచారం.



ఇలా చేయాల్సి ఉన్నా..

మున్సిపల్ చట్టం 1965ను అనుసరించి ఎటువంటి ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో ప్రదర్శించే ప్రకటనలు, సినిమా వాల్ పోస్టర్లు, వాహనాలపై అతికించే వ్యక్తిగత ప్రకటనలు అన్ని నగరపాలక సంస్థకు రుసుములు చెల్లించాల్సిందే. సొమ్మును చెల్లించి రసీదును సైతం బ్యానర్, ఫ్లెక్సీపై ముద్రించి ప్రదర్శించాలి.

వాణిజ్య ప్రకటనలూ తప్పించి..

ప్రకటన ఏజెన్సీలు జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను సైతం తప్పించి వాటి స్థానంలో నేతల బ్యానర్లు ఏర్పాటు చేసి వారి ఆగ్రహానికి గురికాకుండా చూసుకున్నారు. ఏటా నగరపాలికకు రుసుములు చెల్లించాల్సిన అవసరం లేకపోవడంతో రాజకీయ నాయకులు, నగరపాలిక అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించేలా సహకరించినట్లు స్పష్టమవుతోంది.

రూ.1.23 కోట్లతో సరి

2018 వరకు ఏటా ప్రకటన ఏజెన్సీల నుంచి వచ్చే రుసుముల డిమాండ్ రూ.2.65 కోట్లకు పైగా ఉండగా.. 2019 నుంచి అది తగ్గుముఖం పట్టి ప్రస్తుతం రూ.1.23 కోట్లకు చేరింది. అందులోనూ 16 థియేటర్ల నుంచి వచ్చే రూ.6.40 లక్షలు కలిపి ఏటా రూ.30 లక్షల వరకు మాత్రమే వసూళ్లు ఉంటున్నాయి.

రూ.12 కోట్లకు చేరిన ప్రకటన బకాయిలు

నగరపాలక సంస్థకు పలు ప్రకటన ఏజెన్సీలు రూ.12 కోట్లకు పైగా బకాయిలు ఉన్నట్లు అంచనా. 2018లో ఏర్పడిన ఓ వివాదం న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉండటంతో ఒకరిద్దరు మినహా ఎవరూ చెల్లించలేదని తెలుస్తోంది. ఇదే అదనుగా 2019 నుంచి ఉచిత ప్రచార పథకాన్ని నేతలు అమలులోకి తెచ్చారు. 26 ప్రకటన ఏజెన్సీల ద్వారా ఏటా రావాల్సిన మొత్తంలో పదిశాతం మాత్రమే వసూలవుతోంది. ప్రస్తుత అధికారులు చొరవ తీసుకుని న్యాయస్థానంలో ఉన్న వివాదం కొలిక్కి తెస్తే బకాయిలు వసూలయ్యే అవకాశం ఉంటుంది.

కూటమి నేతలకూ ఒంటబడుతోందా?

నేతల పుట్టినరోజులని, పండుగలని, శుభాకాంక్షల పేరుతో వందల సంఖ్యలో బ్యానర్లు ఏర్పాటు చేసి నగరపాలక ఆదాయానికి గండికొడుతున్నా.. అధికారులు మౌనం వహిస్తున్నారు. గత ప్రభుత్వంలో కొనసాగిన ఉచిత ప్రచార సంప్రదాయాన్ని కొందరు కూటమి నేతలు, వారి అనుచరులూ ఇప్పుడిప్పుడే వాడుకలోకి తెస్తున్నారు.

289 మంది పంచాయతీ కార్యదర్శుల బదిలీ



సుశీలదేవి, డీపీవో

తిరుపతి (భావనీనగర్, కలెక్టరేట్), న్యూస్‌టుడే: పంచాయతీరాజ్ పరిధిలో సాధారణ బదిలీల్లో భాగంగా 289 మంది పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారిణి సుశీలదేవి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రేడ్-1 నుంచి గ్రేడ్-4 వరకు 172 మందికిగాను తిరుపతి జిల్లా పరిధిలో 140 మంది, ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి తిరుపతి జిల్లాకు 16 మంది, తిరుపతి జిల్లా నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు 16 మంది బదిలీ అయినట్లు ఆమె వెల్లడించారు. గ్రేడ్-5 కింద 95 మంది, గ్రేడ్-6 డిజిటల్ అసిస్టెంట్లు 22 మంది బదిలీ అయ్యారని వెల్లడించారు. నేతల సిఫార్సులతోనే బదిలీల ప్రక్రియ ఆలస్యమైందని, ఎట్టకేలకు వారు కోరుకున్నట్లు పూర్తిచేసినట్లు ఆరోపణలువ్యక్తమయ్యాయి. జిల్లాలోనే అత్యధిక ఆదాయం కలిగిన తిరుచానూరుకు పోటీ తీవ్రంగా ఉండటంతో కార్యదర్శి నియామకం పెండింగ్‌లో పెట్టినట్లు సమాచారం.

టెట్‌కు 3,454 మంది హాజరు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: జిల్లాలోని తొమ్మిది కేంద్రాల్లో ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్) ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 2,057 మందికిగాను 1,782 మంది, మధ్యాహ్నం 2,053 మందికిగాను 1,672 మంది హాజరయ్యారు.

నేటి నుంచి డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: జిల్లాలోని డిగ్రీ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు జరగనున్నాయి. జిల్లాలోని 65 కళాశాలల్లో మిగిలిన సీట్లనుభర్తీ చేయనున్నారు. ఇప్పటివరకు మూడు పర్యాయాలు ఆన్‌లైన్‌లో భర్తీ ప్రక్రియ చేపట్టారు. 60% వరకే ఖాళీల భర్తీ జరిగినట్లు సమాచారం. తక్కిన సీట్లను ఈనెల తొమ్మిదో తేదీలోపు భర్తీ చేయనున్నారు. తితిదేకు చెందిన కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు పొందిన వారికి హాస్టల్ వసతి, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు వర్తించబోవని తితిదే విద్యాధికారి నాగరాజు నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: ఇలుపూరు నుంచి ఇసుక అక్రమ రవాణాకు రెవెన్యూ అధికారులు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టారు. స్థిరాస్తి క్షేత్రాలు, ఇతర ప్రాంతాల్లో ఉన్న ఇసుక నిల్వలను గుర్తించారు. ఇలుపూరు సమీపాన కాళంగి నదిలో ఇసుక తవ్వకాలు పెచ్చుమీరడంతో దీనిపై 'ఈనాడు'లో శనివారం 'అప్పగిస్తే.. చర్యలు వద్దంటూ..!' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దార్ నరసింహారావు, ఎస్సై బ్రహ్మనాయుడు ఇలుపూరులో ఆదివారం పర్యటించారు. కాళంగి నదీ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో గుర్తించి ఇసుక తీసుకురాకుండా పొక్లెయిన్‌తో గుంతలు తీయించారు. ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

ఈనాడు కథనానికి స్పందన

సిలికా అక్రమార్కులకు సీఐడీ ఉచ్చు

- ప్రభుత్వ భూముల్లో పాగా
- వైకాపా కీలక నేతల కనుసన్నల్లో దోపిడీ



విచ్చలవిడిగా తవ్వేసిన సిలికా

సిలికా అక్రమ తవ్వకాల లెక్కలు పక్కాగా తేలాయి. వైకాపా హయాంలో ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు, లీజుదారులను బెదిరించిన నేతల గుట్టు రట్టయ్యింది. దోపిడీకి సహకరించిన అధికారులు, వెనకున్న సూత్రధారుల వివరాలతో గనుల శాఖ నివేదికలు సిద్ధం చేసింది. ఇందులో వైకాపాలో కీలకంగా వ్యవహరించిన నేతల జాబితా ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వ నిర్ణయం మేరకు సీఐడీకి కేసు అప్పగించే అవకాశం ఉంది.

- న్యూస్‌టుడే, కోట, చిల్లకూరు, గూడూరు

గూడూరు రెవెన్యూ డివిజన్ చిల్లకూరు, కోట మండలాల్లో 79 వరకు లీజులున్నాయి. ఏటా 20 లక్షల టన్నులకు పైగా తవ్వకాలు చేస్తున్నారు. కోట మండలం కొత్తపట్నం, సిద్ధవరం, కర్లపూడి, చిల్లకూరు మండలం వేళ్లపాళెం, ఏరూరు, తమ్మినపట్నం, మోమోడి, తూర్పు కనుపూరు, చింతవరం తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున లీజుకు తీసుకున్నారు. ఎంపిక చేసుకున్న సంస్థలను తమ గుప్పెట్లో పెట్టుకున్న వైకాపా నేతలు ఐదేళ్లూ విచ్చలవిడిగా దోచేశారు.

భూములను కొల్లగొట్టిందెవరు?

సిలికా తవ్వకాల్లో మునిగితేలిన నేతలు అడ్డొచ్చిన వారిపై కేసులు పెట్టిన పరిస్థితి. ఏకంగా రైతుల మీద దాడులు చేయించారు. ఇదే ప్రాంతంలో వైకాపాలో కీలకంగా వ్యవహరించి ఎమ్మెల్సీగా పోటీ చేసిన ఓ నేత, నంబరు-2గా చెప్పుకొంటున్న మరోనేత పాత్రధారులు కాగా వీరికి స్థానికంగా అన్ని పనులు చక్కబెట్టడంలో మరో ఇద్దరు నేతలున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు.

ధరలు పెంచి.. రూ.కోట్లలో దోచేసి..

తవ్వకాలు ఆధీనంలోకి తీసుకున్న నేతలు టన్ను రూ.1,400కు పెంచి సగం ధరలకు అమ్మినట్లు లెక్కల్లో చూపించారు. ఇలా 20 లీజులు, 103 ఎండీఎల్స్ ద్వారా భారీఎత్తున దందా సాగినట్లు గుర్తించారు. దోచిన సొమ్ములు ఎవరి చేతుల్లో చేరాయన్న వివరాలు తేలాల్సి ఉంది. సుమారు రూ.3 వేల కోట్ల మేర దోపిడీ జరిగినట్లు ఆరోపణలున్నాయి.

పక్కా ఆధారాలతో..

అక్రమ తవ్వకాల వ్యవహారం కూటమి ప్రభుత్వం దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. వైకాపా నేతలపైనా సీఐడీకి ఫిర్యాదులు వెళ్లాయి. క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదించాలని నిర్ణయించగా అధికారుల బృందం లెక్కలు తీసింది. ఎంతమేర తవ్వకాలు జరిపారు..? పెనాల్టీలు ఎంత వేయాలి? తదితర వివరాలు సేకరించిన వారు నివేదికను ఉన్నతాధికారులకు ఇచ్చినట్లు తెలిసింది.



పుస్తకావిష్కరణలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి, కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, తితిదే ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి తదితరులు

సింహవాహన సేవలో ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో మూడో రోజు ఆదివారం ఉదయం జరిగిన సింహ వాహన సేవలో నాలుగు ఆధ్యాత్మిక పుస్తకాలను కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి, తితిదే ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి తదితరులు ఆవిష్కరించారు. మారెళ్ల వెంకట శేషారెడ్డి రచించిన 'శ్రీ భాగవతము-ప్రశ్నావళి', డా.కప్పగంతుల రామకృష్ణ రచించిన 'హైందవ సంస్కృతి- వైజ్ఞానికత', డా.పుట్టపర్తి నాగపద్మిని రచించిన 'తిరుమల తిరుపతి క్షేత్ర మహత్యం(హిందీ)', వావిలి కొలను సుబ్బారావు రచించిన 'శ్రీమదొంటిమిట్ట కోదండరామ మహత్యం-వివరణ' పుస్తకాలను ఆవిష్కరించారు.

వాహనదారులకు జరిమానాలు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులపై కొరడా ఝుళిపించారు. సీఐ హరిప్రసాద్ ఆధ్వర్యంలో 28 వాహనాలకు రూ.35,560 జరిమానా విధించారు. చిలకలూరిపేటకు చెందిన సురేష్, అతని వెంటవచ్చిన 14 మందిని రాంభగీచా నుంచి శిలాతోరణం సర్వదర్శనం క్యూలైన్‌లో దింపేందుకు టెంపో డ్రైవర్ ఏకంగా రూ.500 వసూలు చేయడంతో ట్రాఫిక్ పోలీసులు అతడిని గుర్తించి ఆర్టీవోకు అప్పగించారు.

తెలుగు గంగ రైతులకు బెంగ

- కట్ట విస్తరణలో అధికారుల అలసత్వం
- కోతకు గురైతే 400 ఎకరాలకు అపార నష్టం

కేవీబీపురం, న్యూస్‌టుడే: తెలుగుగంగ కాలువ అన్నదాత ఇంట్లో సిరులు పండిస్తోంది.. సాగు, తాగునీరు అందించడమే కాక పచ్చని ఆహ్లాదకర వాతావరణాన్ని సృష్టిస్తోంది.. ఇదీ తెలుగుగంగ కాలువపై అందరికీ ఉన్న భావన. అయితే కేవీబీపురం మండలంలోని అంజూరు రైతులకు మాత్రం తెలుగుగంగ కాలువలో నీరు ప్రవహిస్తే చాలు వారి వ్యథ అంతా ఇంతా కాదు.. కట్ట బలహీన పడటంతో ఎప్పుడు.. ఎక్కడ.. తొట్టంబేడు మండలంలోని కన్నలి తరహాలో నష్టాన్ని చూడాల్సి వస్తుందోనని అక్కడి రైతులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. సమస్య గత కొన్నేళ్లుగా ఉండటం, ప్రస్తుతం తెలుగుగంగలో నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో అక్కడి అన్నదాతకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది.

బలహీనపడిన కట్ట

కేవీబీపురం మండలం అంజూరు సమీపంలోని తెలుగుగంగ కాలువ కుడివైపు కట్ట 96.450 నుంచి 96.700 కి.మీ వరకు బలహీన పడటంతో సమస్య తీవ్రరూపాన్ని దాల్చుతోంది. 250 మీటర్ల వరకు కట్ట పూర్తి స్థాయిలో సన్నగిల్లడమే కాకుండా కట్టపై ముళ్లచెట్లు ఏపుగా పెరిగి ప్రమాదకరంగా మారింది. కాలువ లోపలి భాగంలో రివిట్‌మెంటు దుస్థితికిచేరి కుంగింది. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదాన్ని చూడాల్సి వస్తుందోనని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

400 ఎకరాలు ఎడారే..

తెలుగుగంగ అధికారుల నిర్లక్ష్యం ఇలానే కొనసాగితే తప్పకుండా కట్టకు దిగువనున్న 400 ఎకరాల పంట పొలాలు ఎడారిగా మిగిలే పరిస్థితి ఎప్పుడైనా సంభవించవచ్చు. ఈ కాలువ రాకతో సాగుకు సంతోషించిన అన్నదాత ఆశలపై అధికారుల నిర్లక్ష్యంతో నీళ్లు చల్లుతున్నారు. కాలువలో నీటి ఉద్ధృతిని గమనించిన ప్రతిసారీ సంబంధిత అధికారులకు మొరపెట్టుకోవడం బాధితుల వంతు అయితే వారి గోడును పెడచెవిన పెట్టడం షరా మామూలుగా మారుతోంది. ప్రమాదం జరిగితే మాత్రం సుమారు 155 మంది రైతులు వీధిన పడినట్లేనని ఇప్పటికైనా అధికారులు స్పందిస్తే తమ ఆశలు సజీవంగా మిగులుతాయని బాధిత రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.



తెలుగుగంగ కాలువ కుడివైపు 96.500 కిలోమీటరు వద్ద కుంగి ప్రమాదకరంగా మారిన కట్ట

- **250 మీటర్లకు మహర్దశ ఎప్పుడో..:** మండలంలోని అంజూరు సమీపంలో తెలుగుగంగ కాలువ కుడివైపు కట్ట 96.450 నుంచి 96.700 కి.మీ వరకు కట్టను అభివృద్ధి చేసేందుకు అధికారులు సుముఖం చూపడం లేదు. అభివృద్ధి చేపట్టని కట్టకు సమీపంలోనే కాళంగినది ప్రవాహం ఉండటంతో ప్రమాదం తీవ్ర స్థాయిలో పొంచి ఉంది. 2017లో 96.450 కి.మీ వరకు కట్టను బలపరిచిన అధికారులు మిగిలిన 250 మీటర్ల కట్టను మాత్రం పూర్తిగా విస్మరించారు. గతంలో వర్షాలకు కట్టపై బొగడపడి వరదనీటితో సన్నని గండి ఏర్పడింది. నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తున్న సమయంలో ఎప్పుడైనా ప్రమాదం జరగక మానదని స్థానిక రైతులు అధికారులను హెచ్చరిస్తున్నారు.



తెలుగుగంగ కాలువ కట్ట కుంగిన చోట ప్రమాదకరంగా గండి

- **నివేదికలు పంపాం:** అంజూరు సమీపంలో రివిట్‌మెంట్ కొంత దుస్థితికి చేరుకున్న మాట వాస్తవమే. అయితే దీనివల్ల ప్రస్తుతానికి కాలువలో వెళుతున్న నీటితో ఎలాంటి సమస్య లేదు. అయితే వీటి మరమ్మతులు చేపట్టేందుకు నిధుల కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపావ. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం.

– చిన్మయలింగం, డీఈ, తెలుగుగంగ కాలువ

భవుని అనుగ్రహం.. భవానీ ఆనందం



అసుర సంహారం కోసం తపస్సు చేసిన జ్ఞానాంబికకు శివయ్య అనుగ్రహం లభించింది. శరన్నవరాత్రి వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భవుని అనుగ్రహంతో భవానీ అమ్మవారు పరవశించిపోయారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తికి విశేష అలంకరణలు చేపట్టి ఆలయంలో ఊరేగించారు. ఈవో చంద్రశేఖర్ ఆజాద్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

క్రీడా అకాడమీల ఏర్పాటుకు నిధులు

శాప్ ఛైర్మన్ రవినాయుడు




శాప్ ఛైర్మన్ రవినాయుడును గజమాలతో సత్కరించిన ప్రవీణ్, శ్రీధర్ తదితరులు

తిరుపతి (క్రీడలు), న్యూస్‌టుడే: క్రీడలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ (శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. తిరుపతిలోని శ్రీనివాస క్రీడా సముదాయం వేదికగా ఆదివారం సాయంత్రం అండర్- 14, 17 స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి తైక్వాండో బాలబాలికల పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీలకు ఉమ్మడి 13 జిల్లాలకు చెందిన 700 మంది బాలబాలికలు, శిక్షకులు తరలివచ్చారు. ముఖ్యఅతిథిగా రవి నాయుడు పోటీలను ప్రారంభించారు. రాష్ట్రంలో నూతనంగా క్రీడా అకాడమీల ఏర్పాటు, ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రాలకు కావాల్సిన నిధులను సమకూర్చడానికి కృషి చేస్తామన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్, ఉపవిద్యాశాఖ అధికారి బాలాజీ, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సయ్యద్ సాహెబ్, స్కూల్‌గేమ్స్ కార్యదర్శులు బాబు, జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తితో తరించి.. సర్వం సమర్పించి

1150 వరకు శాసనాల్లో శ్రీవారి విశేషాలు



తిరుమల, తిరుపతిలో పలు గోడలపై శాసనాలు

ఈనాడు డిజిటల్, తిరుపతి: కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వర స్వామి నిత్య కైంకర్యాలకు నెయ్యి వినియోగం శతాబ్దాలుగా కొనసాగుతోంది. స్వామివారి పూజా కార్యక్రమాల్లో నైవేద్యాలకు అత్యంత విశిష్టత ఉంది. వాటి తయారీ, ఇతర సేవల గురించి శాసనాల్లో ప్రస్తావన ఉంది. 1150 వరకు ఉన్న శాసనాల్లో అధికశాతం తిరుమల, తిరుపతిలోని ఆలయ ప్రాకారంపై కనిపిస్తాయి. అవన్నీ 8 నుంచి 18వ శతాబ్ద కాలానికి చెందినవే.

పల్లవ, చోళ, పాండ్య, కడవరాయలు, యాదవరాయలు, విజయనగర రాజులు, మంత్రులు, సామంతులు స్వామిని ఎంతో భక్తితో సేవించి తరించారు. పెద్దఎత్తున విరాళాలు సమర్పించారు. ఆ వివరాలు శాసనాల్లో పొందుపరిచారు. స్వామివారికి చెందిన భూముల్లో పండించే పంటలను పండగలు, బ్రహ్మోత్సవాల సందర్భంగా నైవేద్యాలు తయారు చేసేందుకు వినియోగించేవారు. ఆ సందర్భంలో పాటించాల్సిన నియమాలు, సంప్రదాయాలు, వంటగది నాణ్యత, కొలతలకు సంబంధించిన వివరాలను కూలంకుషంగా ప్రస్తావించారు.

నైవేద్యానికి పెద్దఎత్తున విరాళాలు..

పల్లవ వంశానికి చెందిన కడవన్ పెరుందేవి అనే రాణి శ్రీవారికి ఆహార నైవేద్యాలు అందించేందుకు అవసరమైన భూమి కొనుగోలు నిమిత్తం 4,176 బంగారు నాణేలు విరాళంగా అందించారు. ఇలా అనేకమంది రాజులు 18వ శతాబ్దం వరకు పెద్దఎత్తున విరాళాలు సమర్పిస్తూ వచ్చారు. విజయనగర సామ్రాజ్యాధిపతి శ్రీకృష్ణదేవరాయలు సామాన్య శకం 1509 నుంచి 1529 వరకు ఏడుసార్లు తిరుమలను సందర్శించారు. ఆయన తన సతీమణులు తిరుమలదేవి, చిన్నాదేవిలతో కలిసి వజ్ర వైడూర్యాలు సమర్పించారు. నైవేద్యాల సమర్పణకు బంగారు పాత్రలు బహూకరించారు.

- 1019లో తిరుమల మొదటి ప్రాకారంలోని ఉత్తర గోడపై ఉన్న శాసనం రాజేంద్ర చోళుడు-1 తమిళంలో వేయించారు. ఇందులో నెయ్యి తరలింపు, స్వామివారి సేవకు వినియోగించే విధానం గురించి ప్రస్తావించారు. స్వామివారికి 24 నేతి దీపాలు వెలిగించే వారని వెల్లడవుతోంది. అప్పట్లో 'తిరువేంగట దేవర్'గా కొలిచిన శ్రీవారికి నిత్య సేవలు సభ ఆధ్వర్యంలో జరిగేవి. వాటిని సక్రమంగా చేపట్టడం లేదని గుర్తించి విచారణ అనంతరం వారి ఆధీనంలో ఉన్న నెయ్యి, నిధులను దేవాలయ భాండాగారానికి ఇవ్వాల్సిందిగా ఆదేశించడంతోపాటు దేవాదాయాధికారులు దీపారాధన చేయాల్సిందిగా స్పష్టం చేసినట్లు వెల్లడవుతోంది.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం

తిరుపతి (కలెక్టరేట్): కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం పది గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ డా.వెంకటేశ్వర్ తెలిపారు. జిల్లాస్థాయి అధికారులు తప్పకుండా కార్యక్రమానికి హాజరుకావాలన్నారు. అర్జీదారులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



కృపాప్రిన్సి

నాయుడు పేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట బాల భారతి పాఠశాల ఏడో తరగతి విద్యార్థిని కృపా ప్రిన్సి ఆదివారం రాజమండ్రిలో జరిగిన రాష్ట్ర స్థాయి 600 మీటర్ల పరుగు పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ నెల 17న నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు కోచ్ లక్ష్మయ్య తెలిపారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	124
రిటైల్	146
లేయర్	110
బ్రాయిలర్స్	212
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	241
లేయర్ మాంసం	187

రైలుబండి కష్టాలు

- శ్రీవారి బ్రహ్మోత్సవాలు, దసరా సెలవులతో రద్దీ
- కీలకమైన రూట్లలో దొరకని బెర్తులు
- రోజువారీ రైళ్లు: 90 పైగా
- ప్రయాణికులు: 1.20 లక్ష

తిరుపతి (రైల్వే), న్యూస్‌టుడే: అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవాలను తిలకించడానికి దేశం నలమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. నిత్యం వందలాది రైళ్లు తిరుపతి, రేణిగుంట మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. తిరుపతికి చేరుకోవాలంటే ఎక్కువ మంది రైలు ప్రయాణాన్నే ఆశ్రయిస్తుంటారు. కానీ ఏ రైలు చూసినా.. ప్రయాణికులతో కిక్కిరిసిపోతోంది. రద్దీకి అనుగుణంగా అదనపు రైళ్లు, బోగీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. దేశం నలమూలల నుంచి వచ్చే యాత్రికులకు స్థానిక ప్రాంగణంలో వసతులు పెంచాల్సిన అవసరం ఉంది.

ఈ రైళ్లకు అధిక డిమాండ్: తిరుపతి నుంచి రోజువారీ రాకపోకలు సాగించే నారాయణాద్రి, వెంకటాద్రి, శబరి, పద్మావతి, రాయలసీమ, కృష్ణా, తిరుమల ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అధిక డిమాండ్ ఉంటోంది. వీటిలో సికింద్రాబాద్, కాచిగూడ, నల్గొండ, విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, ఒంగోలు, కర్నూలు, అనంతపురం, నిజామాబాద్ తదితర ప్రాంతాల నుంచి వేలాదిమంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం బ్రహ్మోత్సవాలు, దసరా, దీపావళి సెలవుల నేపథ్యంలో వెయిటింగ్ లిస్టు చాంతాడంత ఉంది. కొన్ని రైళ్లకు రిగ్రెట్ చూపుతోంది. కేరళ, పూరి, హౌరా, షిరిడీ, శ్రీకాకుళం, చెన్నై నుంచి వచ్చే రైళ్లలో బెర్తులు దొరకడం గగనమైంది. ఉత్తర భారత దేశ భక్తులు గూడూరు జంక్షన్‌పైనే ఎక్కువగా ఆధారపడాల్సి వస్తోంది.

ప్రత్యేక రైళ్లలోనూ...: దసరా, దీపావళి, క్రిస్మస్ పండుగలను పురస్కరించుకుని ద.మ.రైల్వే ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. అక్టోబరు, నవంబరులో తిరుపతి నుంచి సికింద్రాబాద్, కాచిగూడ, విశాఖపట్నం, షిరిడీ, మచిలీపట్నం, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లను నిర్దేశించిన తేదీల్లో నడపనుంది. వీటిలో విశాఖపట్నం, శ్రీకాకుళం, కాచిగూడ రైళ్లకు వెయిటింగ్ లిస్టు, ఆర్ఏసీ చూపుతోంది.



రైల్వే ప్రాంగణంలో ప్రయాణికుల పాట్లు

- **ప్రాంగణంలో అరకొర వసతులు..:** బ్రహ్మోత్సవాలు, సెలవుల నేపథ్యంలో తిరుపతి స్టేషన్‌లో వసతులు, సౌకర్యాలు పెంచాల్సిన ఉన్నా.. ఆధునికీకరణ పనుల పేరుతో అధికారులు దాట వేస్తున్నారు. ఉత్తరం వైపు భవనాలను పూర్తిగా కూల్చివేయడంతో సరిపడా వెయిటింగ్ హాళ్లు, మరుగుదొడ్లు లేక ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ప్లాట్‌ఫామ్‌లపై నిర్మాణ పనులు జరుగుతుండటంతో ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు.
- **తప్పని దొంగల బెడద:** శ్రీవారి దర్శనానంతరం తిరుగు ప్రయాణంలో రైలు ఎక్కేందుకు వేచి ఉండే ప్రయాణికులకు దొంగల బెడద తప్పడం లేదు. కళ్లుమూసి తెరిచేలోపే బ్యాగులు, సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు చోరీ చేస్తున్నారు. సాధారణ బోగీల్లో రైలు ఎక్కే సమయంలో జేబు దొంగలు పర్సులు నొక్కేస్తున్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నారుల మెడలోని గొలుసులు సైతం చోరీ చేస్తున్నారు.
- **కల్తీ ఆహారం సరేసరి:** రైల్వే స్టేషన్‌తోపాటు ఎదురుగా ఉన్న హోటళ్లలో ఆహార నాణ్యత, ధరలపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఉదయం వండిన సాంబారును రాత్రి వరకు వేడి చేస్తూనే ఇడ్లీ, దోసె, అన్నంలోకి పోస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్లాట్‌ఫాంలపై విక్రయించే పదార్థాల్లో నాణ్యత లేవని ఆరోపిస్తున్నారు.
- **ఆటోవాలాల దోపిడీ...:** దేశ నలమూలల నుంచి తిరుపతికి వచ్చీరాగానే పర్యటకులను, యాత్రికులను ఆటో డ్రైవర్లు దోచుకుంటున్నారు. రైలు దిగడం మొదలు బస కేంద్రానికి వెళ్లాలన్నా, స్థానిక పుణ్యక్షేత్రాలైన తిరుచానూరు (అలిమేలు మంగాపురం),గోవిందరాజస్వామి ఆలయం, కోదండ రామాలయం, ఇస్కాన్ మందిరం, కపిలతీర్థం, శ్రీనివాస మంగాపురం వంటి ఆలయాలకు వెళ్లాలంటే రూ.వందల్లో వసూలు చేస్తున్నారు. ధరలపై ట్రాఫిక్ పోలీసుల నియంత్రణ లేకపోవడం, సంఘాల నేతల పెత్తనంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

గరుడసేవకు వాహనాలపై ఆంక్షలు

- నేటి రాత్రి నుంచే ద్విచక్ర వాహనాలు, ట్యాక్సీల రాకపోకలు నిలిపివేత

తిరుపతి (నేరవిభాగం, బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో అత్యంత విశేషమైన గరుడ వాహన సేవను పురస్కరించుకుని ముందురోజు నుంచే ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు ప్రకటించారు. తిరుమలలో ఎనిమిది వేల వాహనాల పార్కింగ్‌కు మాత్రమే అవకాశం ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈనెల 7వ తేదీ రాత్రి తొమ్మిది గంటల నుంచి ఈనెల 9న ఉదయం వరకు ఘాట్ రోడ్డులో ద్విచక్ర వాహనాలు, ఎల్లో బోర్డు (ట్యాక్సీ) వాహనాలు నిషేధించినట్లు పేర్కొన్నారు.

■ **తొమ్మిది పార్కింగ్ కేంద్రాలు:** గరుడసేవ రోజు తిరుమలలో ఎనిమిదివేల వాహనాల పార్కింగ్ సామర్థ్యం చేరుకున్నాక సొంత వాహనాలను అనుమతించరు. కడప, శ్రీకాళహస్తి నుంచి వచ్చే వాహనదారులు కరకంబాడి సమీపంలోని ఎస్వీసీ ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఆపాలి. పుత్తూరు మార్గం నుంచి వచ్చే భక్తులు శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలో పార్కింగ్ చేసుకోవాలి. చిత్తూరు, పీలేరు వైపు నుంచి వచ్చే వాహనాలు దేవ్‌లోక్, భారతీయ విద్యాభవన్ మైదానంలో వాహనాలు నిలపాలి. ద్విచక్ర వాహనదారులు ఇస్కాన్, నెహ్రూ మున్సిపల్ స్కూల్ మైదానం సద్వినియోగం చేసుకోవాలి. వీటితోపాటు సింధు, తనపల్లి, ఆర్సీపురం, నంది కూడళ్ల వద్ద వాహనాలు పార్కింగ్ చేసుకోవచ్చు. ప్రతి పార్కింగ్ కేంద్రం వద్ద భక్తులు తిరుమలకు వెళ్లడానికి వీలుగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశారు.

ముందస్తుగా 'మద్యం' దరఖాస్తులు చేసుకోండి

- లాటరీలో అదనంగా ఇద్దరి ఎంపిక
- ఉమ్మడి చిత్తూరు జిల్లా డీసీ విజయశేఖర్

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: చివరిరోజైన 9వ తేదీ అత్యధికంగా దరఖాస్తులు నమోదుకు అవకాశం లేకుండా ఈనెల 7, 8 తేదీల్లోనే మద్యం దుకాణాల నిమిత్తం దరఖాస్తులు చేసుకోవాలని ఉమ్మడి చిత్తూరు జిల్లాల ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ పిలుపునిచ్చారు. ఆదివారం తిరుపతి అర్బన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. తిరుపతి జిల్లాలో 227.. చిత్తూరు జిల్లాలో 104 మద్యం దుకాణాల కేటాయింపునకు టెండర్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులను అడ్డుకోవడం.. బెదిరించడం వంటి ఘటనలకు అవకాశం లేకుండా మూడు పద్ధతుల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 11న తిరుపతి జిల్లాకు సంబంధించి శిల్పారామం.. చిత్తూరుకు సంబంధించి షుగర్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో ఆయా కలెక్టర్లు లాటరీ తీసి ఎంపిక చేస్తారన్నారు. ప్రతి దుకాణానికి లాటరీలో ఒకరిని ఎంపిక చేసిన తర్వాత.. మరో ఇద్దరిని రిజర్వుగా ఎంపిక చేస్తామని, ఎంపికైన వ్యక్తి డబ్బు కట్టకపోతే తరువాత వారికి కేటాయిస్తామన్నారు. అనుమానాల నివృత్తికి టోల్‌ఫ్రీ నెంబరు 04042425520ను సంప్రదించాలని డీసీ కోరారు. ఈఎస్ నాగమల్లీశ్వరరెడ్డి, ఏఈఎస్ వాసుదేవ చౌదరి, సీఐలు రామచంద్ర, నరసానాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎక్సైజ్ డీసీ విజయశేఖర్ తదితరులు

తిరుమలలో దుకాణదారులపై చర్యలు



లేపాక్షి పక్కన ఉన్న దుకాణాన్ని మూసివేయిస్తున్న అధికారులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాను పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు దుకాణదారులు అధిక ధరలకు విక్రయించడం, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో పరిశుభ్రత పాటించకపోవడం వంటివాటిపై తిరుమల రెవెన్యూ విభాగం అధికారులు చర్యలు చేపట్టారు. ఆదివారం తితిదే ఎస్టేట్ అధికారి వెంకటేశ్వర రావు, ఏఈవో నారాయణ చౌదరి, టాస్క్‌ఫోర్ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. రెండు టీ దుకాణాలు, రెండు ఫ్యాన్సీ షాపులను సీజ్ చేశారు. గోవర్దన్ సత్రం వద్ద తితిదే కేటాయించిన స్థలాల కంటే ఎక్కువ ఆక్రమించుకుని అపరిశుభ్ర వాతావరణంలో నిర్వహిస్తున్న ఐదు ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు సీజ్ చేశారు. పీఏసీ-1 వద్ద ఎక్కువ స్థలం ఆక్రమించుకుని వ్యాపారం నిర్వహిస్తున్న మూడు హాకర్ లైసెన్సులను తాత్కాలికంగా స్వాధీనం చేసుకున్నారు. డీఎంబీ రోడ్డులో భక్తులకు అడ్డంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి హెచ్చరికలు జారీచేశారు.

ఆర్థిక లావాదేవీల నేపథ్యంలోనే బాలిక హత్య

తల్లీకూతురితోపాటు బాలుడి అరెస్టు ◆ అస్పియా హత్య కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ, కలెక్టర్

పుంగనూరు గ్రామీణ: ఆర్థిక లావాదేవీల నేపథ్యంలోనే పుంగనూరులో బాలిక అస్పియా (7) హత్య జరిగిందని ఎస్పీ మణికంఠ చందోలు పేర్కొన్నారు. ఏడు రోజులుగా నెలకొన్న ఉత్కంఠకు తెరదించినట్లు తెలిపారు. నిందితులు బాధితుడైన అజ్మతుల్లా ఇంటికి కేవలం వంద మీటర్ల దూరంలో నివసిస్తున్న తల్లీకుమార్తె, ఓ బాలుడని.. వారిని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. హత్య కేసు వివరాలను కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి సర్కిల్ కార్యాలయంలో ఆదివారం వెల్లడించారు.

■ **అభ్యంతరకరంగా మాట్లాడటంతోనే..:** 'అస్పియా తండ్రి అజ్మతుల్లా వడ్డీ వ్యాపారి. తన వద్ద నగదు తీసుకుని సమయానికి ఇవ్వని వారిని అసభ్యకరంగా మాట్లాడేవారు. అజ్మతుల్లా ఇంటికి వంద మీటర్ల దూరంలో నివసిస్తున్న హసీనా, ఆమె కుమార్తె రేష్మ ఇంటి నిర్మాణానికి అజ్మతుల్లా వద్ద రూ.3.50 లక్షల నగదు వడ్డీకి తీసుకున్నారు. ఈ మొత్తం గడువుమీరినా ఇవ్వకపోవడంతో ఫోన్ చేసి గట్టిగా మాట్లాడేవారు. దీన్ని వారు అవమానంగా భావించి అతనిపై కక్ష పెంచుకున్నారు. గత నెల 29న అస్పియాను అపహరించారు' అంటూ ఎస్పీ తెలిపారు.

■ **చాక్లెట్, భోజనం పెట్టి.. ముక్కుమూసి హత్య:** 'నిందితురాలు రేష్మ బురఖా ధరించి బాలికకు చాక్లెట్ ఇచ్చి ఇంటికి తీసుకెళ్లి భోజనం పెట్టారు. కొద్దిసేపటికే బాలిక ఇంటికి వెళ్లాలని ఏడ్చింది. బయటకు వినిపిస్తే ఇబ్బంది అవుతుందనే అనుమానంతో ఓ బాలుడిని కాపలా పెట్టి నిందితులు బాలిక ముక్కు, నోరు మూయడంతో శ్వాస అందక మృతి చెందింది'. 'ఆ సమయంలో బాలిక పెనుగులాడిందని.. రేష్మను బాలిక చేతి గోర్లతో రక్కిన గుర్తులున్నాయి. మృతదేహాన్ని రేష్మకు తమ్ముడి వరసయ్యే బాలుడి సాయంతో ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి ట్యాంకులో విసిరేశారు' అంటూ ఎస్పీ వివరించారు. సమావేశంలో డీఎస్పీలు సాయినాథ్, ప్రభాకర్, సీఐలు శ్రీనివాసులు, సీఐ భాస్కర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ, చిత్రంలో కలెక్టర్ సుమిత్ కుమార్, డీఎస్పీ, వైద్యాధికారి

అత్యుత్సాహం తగదు: కలెక్టర్

ఈ కేసును కొన్ని పత్రికలు, టీవీలు హత్యాచారంగా చూపుతూ ప్రచారం చేశాయని.. మొత్తంగా బాలిక హత్య ఘటనపై అత్యుత్సాహం చూపారని కలెక్టర్ సుమిత్‌కుమార్ అసహనాన్ని వ్యక్తం చేశారు. ఇలా ప్రవర్తించిన మీడియాపై ఎందుకు కేసులు నమోదు చేయకూడదని ప్రశ్నించారు.

- అస్పియా పోస్టుమార్టం నివేదికలో హత్యాచారం జరగలేదని తేలిందని పుంగనూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్యాధికారి మధుసుదనాచారి తెలిపారు. ఎక్కడా గాయాలు, ఇతర ఆనవాళ్లు లేవన్నారు. ల్యాబ్ రిపోర్టు వచ్చిన అనంతరం నివేదిక వెల్లడిస్తామన్నారు.

ఇద్దరిపై తాత్కాలిక సస్పెన్షన్

శ్రీకాళహస్తి: నిబంధనలు ఉల్లంఘించిన ఇద్దరు ఉద్యోగులపై శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాదుకు చెందిన సుజాత రామకృష్ణన్ ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకున్నట్లు ఆదివారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొనడం చర్చనీయాంశమైంది. ఫిర్యాదుదారులైన సుజాత రామకృష్ణన్ ఈనెల 1వ తేదీన ఫిర్యాదు చేశారన్నారు. బలవంతపు వసూళ్లు చేయరాదని స్పష్టమైన నిబంధనలు ఉన్నా ఉల్లంఘించిన కారణంగా పేర్రాజు శర్మను, ప్రొటోకాల్ విధులు నిర్వహిస్తున్న శ్రీనాథ్ ఫిర్యాదు దారులైన భక్తురాలితో పాటు మరో 21 మంది భక్తులను అంతరాలయ దర్శనానికి తీసుకెళ్లడాన్ని సీసీ కెమెరా ద్వారా నిర్ధారణ చేసుకున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అంతేకాకుండా ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.వెయ్యి వంతున అదనంగా వసూలు చేసినట్లు విచారణలో స్పష్టం కావడంతో ఈ ఇద్దరు ఉద్యోగులను తాత్కాలికంగా విధుల నుంచి తొలగించారు.

తిరుపతి
•తిరుపతి •చంద్రగిరి

ఉత్తమ సమాజ సేవా పురస్కారం


పురస్కారం అందుకుంటున్న భారతి

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తిరుపతి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయిని, ఎన్‌సీసీ అధికారిణిగా విధులు నిర్వహిస్తున్న సి.భారతికి బహుజన సాహిత్య అకాడమీ జాతీయ సంస్థ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ ఆదివారం స్థానికంగా జరిగిన కార్యక్రమంలో ఉత్తమ జాతీయ సమాజ సేవా పురస్కారం ప్రదానం చేశారు. పలు రాష్ట్రాల బహుజన సేవాసంస్థ అధ్యక్షులు పాల్గొన్నారు. హెచ్‌ఎం వెంకటసుబ్బమ్మ, అనసూయమ్మ పాల్గొన్నారు.

జక్కదొన.. పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణలో పాల్గొన్న అతిథులు

తిరుపతి (బైరాగిపట్టెడ): ప్రముఖ రచయిత ఆర్.సి.కృష్ణస్వామి రాజు రచించిన జక్కదొన కథా సంపుటి పుస్తకావిష్కరణ సభ ఎస్వీయూ ప్రాచ్య పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం వర్సిటీ సెనేట్ హాల్లో జరిగింది. తితిదే పూర్వపు జేఈవో, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కేవీస్ శ్రీనివాసరాజు, ప్రాచ్య పరిశోధనా సంస్థ సంచాలకులు ఆచార్య పి.సి. వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఎస్వీయూ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, మద్రాస్ ప్రెసిడెన్సీ కళాశాల అధ్యాపకులు ఎలిజిబెత్ జయకుమారి, డాక్టర్ గరికపాటి రమేష్‌బాబు ప్రసంగించారు. కృష్ణస్వామిరాజు స్పందిస్తూ తాను సామాజిక బాధ్యతతోనే కథలు రాస్తున్నానన్నారు.

సమాచార కేంద్రాలేవీ?

భక్తులకు తప్పని దోపిడీ


అలిపిరిలో మూతబడిన తితిదే సమాచార కేంద్రం

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: శ్రీవారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులను ఇక్కడి వాహనదారులు, లాడ్జీలు, హోటళ్ల నిర్వాహకులు నిలువునా దోచేస్తున్నారు. ఎక్కడికక్కడ ఏజెంట్లతో ఎరవేస్తూ భారీగా దండుకుంటున్నారు. తితిదే వసతి సముదాయాల్లో గదులు దొరక్క ఇబ్బందులు పడే భక్తులు ప్రైవేటు లాడ్జీలను ఆశ్రయించక తప్పడంలేదు. ఇదే అదునుగా గదుల అద్దెలను రెండింతలు మూడింతలు పెంచేస్తున్నారు. వాటి యజమానులపై నిఘా లేకపోవడం, గదుల అద్దెలపై నియంత్రణ లేకపోవడంతో భక్తులు మోసపోతున్నారు. వారి ఆగడాలను అరికట్టాల్సిన అధికార యంత్రాంగం వారిచ్చే మామూళ్లకు ఆశపడి భక్తులకు తీరని ద్రోహం చేస్తున్నారంటూ ప్రజలు వాపోతున్నారు. ● భక్తులు తిరుపతి రైల్వే స్టేషన్, బస్టాండులో దిగింది మొదలు తిరిగి వారు తమ సొంత ప్రాంతాలకు బయలుదేరేవరకు ప్రైవేటు వాహనదారులు భక్తులను ఏమార్చి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారంటూ ఫిర్యాదులు వెలువెత్తుతున్నాయి. వాటి పరిధిలో బస్సులు ఉన్నప్పటికీ కొందరు స్థానిక ఆలయాలు సందర్శించే నిమిత్తం కార్లు, ఆటోలను ఆశ్రయిస్తున్నారు.

ఉన్నవాటిలో సేవలందక..

తిరుమల శ్రీవారిని దర్శించే నిమిత్తం తిరుపతికి విచ్చేసిన భక్తులకు రైల్వే స్టేషన్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో సమాచార కేంద్రాలు లేక వివరాలు తెలియక భక్తులు బయటవారిని ఆశ్రయించాల్సి వస్తోంది. ఫలితంగా గదుల పేరుతో రవాణా ఛార్జీల పేరుతో దర్శనాలు చేయిస్తామంటూ, మీకు ఏ టికెట్ కావాలన్నా తామే ఏర్పాటు చేస్తామంటూ భక్తులను రకరకాలుగా మోసగిస్తూ డబ్బులు దండుకుంటున్నారు. బస్టాండు, రైల్వేస్టేషన్, వసతిగృహాల ప్రాంతాల్లో తితిదే సమాచార కేంద్రాలు ఏర్పాటు చేయాలని.. పోలీసు విభాగం ఆధ్వర్యంలో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి 24 గంటల పాటు సేవలు అందించే రీతిలో చూడాలని భక్తులు కోరుకుంటున్నారు. ప్రస్తుతం అక్కడక్కడ కేంద్రాలు ఉన్నప్పటికీ వాటిలో అందులో సిబ్బంది లేక, సమయానికి తెరవక, భక్తులకు ఏమాత్రం ఉపయోగకరంగా లేవనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఆలయ సిబ్బంది దురుసు ప్రవర్తన

తిరుచానూరు: పుష్కరిణి పరిసర ప్రాంతాల్లో రాత్రి విశ్రాంతి తీసుకునేందుకు వచ్చిన తమిళనాడు గోవిందమాల భక్తుల పట్ల ఆలయ ప్రైవేటు భద్రతా సిబ్బంది దురుసుగా ప్రవర్తించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. శనివారం అర్ధరాత్రి తమిళనాడుకు చెందిన భక్తులు పాదయాత్రగా తిరుమలకు వెళ్తూ తిరుచానూరులో విశ్రాంతి తీసుకునేందుకు ఆగారు. భద్రతా సిబ్బంది విశ్రాంతి తీసుకునేందుకు అనుమతించకపోగా.. వారి పట్ల దురుసుగా ప్రవర్తించారు. తిరుమాడ వీధుల్లో రాత్రి సమయాల్లో భక్తుల రాకపోకలపై ఎటువంటి నిషేధం అమల్లో లేకపోయినా భద్రతా సిబ్బంది దురుసుగా వ్యవహరించిన తీరు వివాదాస్పదంగా మారింది.

ఏనుగుల సంచారంతో రైతుల్లో కలవరం

పాకాల, న్యూస్‌టుడే: పులిచెర్ల మండలం, కల్లూరు సమీపంలోని గోగుల వంక పరిసరాల్లో ఆదివారం 16 ఏనుగుల గుంపు సంచరిస్తోందనే సమాచారం రావడంతో పొరుగునే ఉన్న పదిపుట్లబైలు పంచాయతీ పుల్లావాండ్లపల్లి, నడింపల్లి, కొండకిందపల్లి, దామలచెరువు పంచాయతీలోని కాకర్లవారిపల్లి గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏనుగుల గుంపును దూరంగా మళ్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఘాట్‌రోడ్డులో ప్రమాదం

తిరుమల, న్యూస్‌టుడే: మొదటి ఘాట్‌రోడ్డులో కారు అదుపుతప్పి అటవీ ప్రాంతంలోకి దూసుకెళ్లిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. తమిళనాడుకు చెందిన భక్తులు కారులో తిరుమలకు చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఘాట్‌రోడ్డు మీదుగా తిరుపతికి బయలుదేరారు. 18వ మలుపు వద్దకు రాగానే కారు బ్రేకులు ఫెయిల్‌కావడంతో అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొని అటవీప్రాంతంలోకి వెళ్లి ఆగిపోయింది. భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


బి.సుబ్రహ్మణ్యం (పాతచిత్రం)

తిరుపతి గ్రామీణ, న్యూస్‌టుడే: తిరుపతి గ్రామీణ మండలం పుదిపట్ల పంచాయతీ, చైతన్యపురం గ్రామంలో సుబ్రహ్మణ్యం(45) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. సుబ్రహ్మణ్యం కొన్నేళ్లుగా మత్తుకు బానిసై మత్తుపదార్థాలు ఎక్కువగా తీసుకోవడంతో మృతి చెందారని స్థానికులు పేర్కొన్నారు. ఈ విషయమై ఎమ్మార్‌పల్లి పోలీసులను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదులు రాలేదని వివరించారు.

ముగిసిన మోహన మంత్ర

చంద్రగిరి గ్రామీణ: మోహన్‌బాబు వర్సిటీలో మోహన మంత్ర కార్యక్రమం దిగ్విజయంగా ముగిసిందని సమన్వయకర్త ఆచార్య దేవరాజులు తెలిపారు. రాబోయే సంవత్సరం సరికొత్త రీతిలో నిర్వహిస్తామన్నారు. చివరిరోజు విద్యార్థులు నృత్యాలతో అలరించారు. రిజిస్ట్రార్ కె.సారథి, ఉపకులపతి నాగరాజు రామారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆలయ సిబ్బందికి వస్త్ర బహుమానం

తిరుమల: బ్రహ్మోత్సవాల్లో సేవలందిస్తున్న వాహన బేరర్లు, మేళం సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బందికి సేలానికి చెందిన మెక్కినేశ్వరీ టెక్స్‌టైల్స్ అధినేత తంగదొరై దంపతులు ఆదివారం వస్త్ర బహుమానం చేశారు. వైభవోత్సవ మండపంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి చేతుల మీదుగా వస్త్రాలను అందించారు.

శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి • సత్యవేడు

బాధితురాలికి పరామర్శ



యశోదమ్మ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న బొజ్జల బృందమ్మ

శ్రీకాళహస్తి(గ్రామీణం(ఏర్పేడు), న్యూస్‌టుడే: మండలానికి చెందిన తెదేపా సీనియర్ నేత తాటిపర్తి ఈశ్వర్‌రెడ్డి సతీమణి యశోదమ్మను బొజ్జల బృందమ్మ పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న యశోదమ్మ చెన్నై ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించుకుని ఆదివారం ఎంపేడుకు వచ్చారు. దీంతో బొజ్జల బృందమ్మ ఎంపేడుకు చేరుకుని ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రవీంద్రనాథ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, స్థానిక తెదేపా నేతలు పాల్గొన్నారు.

లూథరన్ చర్చిలో అర్పణల పండుగ



ప్రార్థన నిర్వహిస్తున్న రెవరెండ్ పాస్టర్ టెన్సింగ్ విక్టర్

రేణిగుంట, న్యూస్‌టుడే: స్థానిక లూథరన్ చర్చిలో కృతజ్ఞత అర్పణల పండుగను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది ఈ సమయంలో ఈ పండుగ నిర్వహిస్తారు. ఇందులో భాగంగా శనివారం అర్ధరాత్రి చర్చిని వివిధ రకాల పండ్లు, పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆదివారం ఉదయం రెవరెండ్ పాస్టర్ టెన్సింగ్ విక్టర్ ఈ పండుగ విశిష్టతను సభ్యులకు వివరించారు. అంసుమత్ మేరీ, శాంతి స్వరూప్, భగవాన్, హనూక్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయం తప్పితే చర్యలు

శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో ఆదేశం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయ దర్శనార్థం వచ్చే భక్తులు సంప్రదాయ వస్త్రధారణ, తిలకధారణ ఇకపై విధిగా అమలు చేసేలా ఈవో చంద్రశేఖర్ ఆజాద్ ఆదేశించారు. భక్తులు పాటించేలా చర్యలు తీసుకోవాలని, అలా కాకుండా సంప్రదాయ వస్త్రధారణ లేకుండా దర్శనాలు, అభిషేకాలు, రాహు, కేతు పూజలకు అనుమతిస్తే సంబంధిత అధికారులపై చర్యలు కఠినతరంగా ఉంటాయని ఆదివారం ఇచ్చిన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. స్వామి, అమ్మవార్లకు నిర్వహించే రాహు, కేతు పూజలు చేయించుకునే భక్తులు విధిగా సంప్రదాయ వస్త్రాలతో హాజరు కావాల్సి ఉందన్నారు. దీనిపై భక్తులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, ఇందు కోసం ఇంజినీరింగ్ శాఖ ఆలయంతో పాటు పట్టణంలోని ప్రధాన కూడళ్లలో సూచికలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఆలయ ప్రవేశ ద్వారాలతో పాటు మహద్వారం వద్ద విభూదీ, కుంకుమ, చందనం అందుబాటులో ఉంచాలని, ప్రతి ఒక్కరూ వాళ్లకు ఇష్టమైన దాన్ని ధరించి ఆలయంలో స్వామి, అమ్మవార్లను దర్శనం చేసుకోవాలని సూచనలు చేశారు.

వారాంతర సెలవు మార్పు: ముక్కంటి ఆలయంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఆదివారం వారాంతపు సెలవును మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం రద్దీ ఎక్కువగా ఉంటున్న నేపథ్యంలో ఉద్యోగులందరూ విధులకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. ఇక వారాంతపు సెలవులను కొంత మందికి మంగళవారం, మరికొంత మందికి బుధవారం ఇచ్చేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచనలు చేశారు.

ఇప్పుడైనా మారేనా..!

అన్న క్యాంటీన్ పక్కనే మద్యం దుకాణం



వంతెనల కూడలిలో కొనసాగుతున్న మద్యం దుకాణం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పట్టణ వ్యాప్తంగా పలు చోట్ల మద్యం దుకాణాలు ఏర్పాటయ్యాయి. అయితే ప్రత్యేకించి సువర్ణముఖి నదీ తీరంలో రామసేతు వంతెనల కూడలిలో ఏర్పాటైన మద్యం దుకాణంపై తొలి నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నా పట్టించుకునే వాళ్లు లేకుండా పోయారు. తెదేపా హయాంలో దీన్ని మార్పు చేయాలన్న ప్రణాళికలు సిద్ధమయ్యేలోపు ఎన్నికలు రావడంతో వైకాపా హయాంలో అయిదేళ్ల పాటు ఇక్కడే మద్యం దుకాణం కొనసాగుతూ వచ్చింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రధానంగా రామసేతు వంతెనల కూడలిలో అక్కడ దిగే భక్తుల సౌకర్యార్థం అన్న క్యాంటీన్ ఏర్పాటు చేశారు. తిరుపతి నుంచి వచ్చే భక్తులందరూ ఆలయానికి వెళ్లేందుకు ఇక్కడే బస్సు దిగుతుంటారు. దీంతో ఎప్పుడూ ఈ ప్రాంతం కాస్తంత సందడిగా ఉంటుంది. దీనికి తోడు మద్యం దుకాణం కారణంగా మందుబాబులతో అక్కడ కొంత ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం నూతనంగా మద్యం దుకాణాల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రస్తుతమైనా ఇక్కడున్న మద్యం దుకాణం మరో ప్రాంతానికి తరలించే దిశగా అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

ముక్కంటి సేవలో సినీనటుడు సప్తగిరి



శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: తెలుగు సినీనటుడు సప్తగిరి ముక్కంటి దర్శనార్థం వచ్చారు. ఈయనకు ఆలయ అధికారులు ఆదివారం దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆలయంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. దర్శనానంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆలయ వైదిక కమిటీ ఏర్పాటు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వైదిక కమిటీని ఏర్పాటు చేస్తూ ఆలయ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆదివారం ఉత్వర్వులను సంబంధిత అధికారులకు పంపారు. కమిటీలో ఆలయ ప్రధాన అర్చకులు సంబంధం గురుకుల్, కరుణ గురుకుల్, వేదపండితులు బాలసుబ్రహ్మణ్యం, శివప్రసాద్, పురోహితులు అర్ధగిరిశర్మ, అర్చకుల నుంచి నరసింహమూర్తి, పరిచారకుల నుంచి వేంకటేశ్వర శర్మలను నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో ఉపయోగం

బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: వృత్తి విద్యా కోర్సులు విద్యార్థులకు భవిష్యత్తులో ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణయ్య అన్నారు. విద్యార్థుల నైపుణ్యతను పెంపొందించడంలో భాగంగా ఆదివారం పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులతో కలిసి మీసేవా కేంద్రాన్ని సందర్శించారు.

చిల్లర సర్దుబాటుకు ఉత్తర్వులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున చేస్తున్న పార్కింగ్ సిబ్బంది సౌకర్యార్థం చిల్లర సర్దుబాటు చేస్తూ ఆలయ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కారు జీపునకు రూ.59కి బదులుగా రూ.60, ఇన్నోవా, స్కార్పియో, సుమోలకు రూ.71కి బదులు రూ.70, మినీబస్సుకు రూ.118కి బదులు రూ.120, బస్సు, లారీలకు రూ.177కు బదులు రూ.180గా మార్పు చేశారు.

అధ్వాన పారిశుద్ధ్యంపై ఎమ్మెల్యే ఆగ్రహం

రేణిగుంట, న్యూస్‌టుడే: ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంటే ఏమి చర్యలు తీసుకుంటున్నారని సంబంధిత అధికారులపై ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం 'ఈనాడు'లో 'కాలువల్లో పేరుకుపోతున్న వ్యర్థాలు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై ఆయన స్పందించి స్థానిక నాయకులను, పంచాయతీ అధికారులను వివరణ కోరారు. ప్రజా రోగ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు.

'ఆదిమూలంపై సస్పెన్షన్ తొలగించండి'

నాగలాపురం: ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై తెదేపా విధించిన సస్పెన్షన్‌ను తొలగించాలని ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును శనివారం తిరుపతిలో కోరారు. ఎమ్మెల్యేపై కోవర్టులు పన్నిన కుట్రను హైకోర్టు సైతం తేటతెల్లం చేసిందన్నారు.











శ్రీకాళహస్తి: కూష్మాండ రూపంలో బొమ్మల కొలువు అమ్మవారు ❖ శ్రీకాళహస్తి: మోదకాలతో ముత్యాలమ్మకు విశేష అలంకరణ ❖ నాగలాపురం: మరగదాంబికాదేవిశక్తిరూపిణి.. వరప్రదాయిని ❖ వరదయ్యపాళెం: త్రిపురసుందరిదేవిగా కొలువైన కామాక్షమ్మ ❖ సత్యవేడు: లలితా త్రిపురసుందరీదేవిగా ❖ రేణిగుంట: చందన అలంకరణలో గంగమ్మ ❖ నారాయణవనం: అన్నపూర్ణదేవిగా శ్రీఅవనాక్షమ్మ ❖ ఏర్పేడు: గుడిమల్లం శ్రీఆనందవల్లీదేవి ❖ తొట్టంబేడు: శ్రీమహాలక్ష్మి అలంకరణలో బంగారమ్మ

శక్తిరూపిణి.. వరప్రదాయిని

దేవీనవరాత్రి వార్షిక ఉత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తి పట్టణం, గ్రామీణం, సత్యవేడు నియోజకవర్గ అన్ని శక్తి ఆలయాల్లో వేడుకలు ఆద్యంతం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం అమ్మవార్లకు విశేష అలంకరణలు చేపట్టారు. ముక్కంటి ఆలయానికి అనుబంధంగా కనకాచలంపై వెలసిన కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక రీతిలో విశేష అభిషేకాలు నిర్వహించారు. ముత్యాలమ్మ, పొన్నాలమ్మ, చిన్నగంగమ్మ, ఓంశక్తి, నల్లగంగమ్మ, చాముండేశ్వరి, శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో వేడుకలు విశేష రీతిలో జరిపారు. మహిళలు నిమ్మకాయదీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. **- న్యూస్‌టుడే బృందం**

వైకాపా కుటిల బుద్ధికి నిదర్శనం



చక్రాల ఉష ఫొటోలు చూపుతున్న పార్టీ శ్రేణులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: వైకాపా కుటిల బుద్ధితో తెదేపా శ్రేణుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్నారని తెదేపా పట్టణ కమిటీ అధ్యక్షులు విజయకుమార్, కార్యదర్శి కాసరం రమేష్‌లు సంయుక్తంగా ధ్వజమెత్తారు. పట్టణంలోని తెదేపా కార్యాలయంలో ఆదివారం పార్టీ శ్రేణులు, తెలుగు మహిళలతో కలసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. తెదేపా పెద్దలు, బొజ్జల కుటుంబీకులు ఆమెకు పార్టీలో ఉన్నత స్థానం కల్పించారన్నారు. ఎన్నికలకు ముందు పార్టీని వీడి వైకాపాలో చేరడంతో పాటు పార్టీని, బొజ్జల కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చక్రాల ఉష ఉద్దేశపూర్వకంగా నారా లోకేశ్ నిర్వహించిన ప్రజాదర్బార్‌కు హాజరై ఆ ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పెట్టుకోవడం సిగ్గు చేటన్నారు. సమావేశంలో తెలుగు మహిళలు సుమతి, మల్లీశ్వరి, రేణుకమ్మ, సుప్రజ, నేతలు మునిరాజాయాదవ్, సుబ్బయ్య, బాలాజీ, శ్రీనివాస్‌రెడ్డి, గోపి, విజయ్‌లక్ష్మి, చంద్రకళ, సుజాత, మీర్జా, కిట్టు పాల్గొన్నారు.

జడ్పీ నిధుల వరద.. తీరిన కష్టాల బెడద

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం జడ్పీ నిధులను మంజూరు చేయడంతో పలు గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కారమయ్యాయి. మండలంలో పది గ్రామాలకు జడ్పీ నిధుల ద్వారా రూ.15లక్షలు నిధులు మంజూరైయ్యాయి. మండలంలోని కురుంజలం, యానాదివెట్టు, వరదయ్యపాళెం, వరదయ్యపాళెం అరుంధతీవాడ, ఇందిరానగర్, నెలటూరు, మోపురుపల్లి, కళత్తూరు గిరిజనకాలనీ, అయ్యావారిపాళెంలలో తాగునీటి సమస్యలు నెలకొన్నాయి. మండలానికి జడ్పీ నిధులను మంజూరయ్యేలా కృషి చేసిన జడ్పీటీసీ సభ్యులు వెంకటేశ్వర్లుకు ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు, సర్పంచులు కృతజ్ఞతలు తెలిపారు.

తమిళనాడు భక్తురాలి అదృశ్యం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వచ్చిన తమిళనాడు భక్తురాలు అదృశ్యమయ్యారు. ఈ మేరకు ఆదివారం వారి కుటుంబీకులు ఆదివారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమిళనాడులోని పెరుంబుదూరు జిల్లా బ్రహ్మదేశం గ్రామానికి చెందిన మన్నాంగతి(70)తో ఈ నెల 3వ తేదీనముక్కంటి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆసమయంలో కన్పించకుండా పోయింది. ఆదివారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వేడుకగా శ్రీవారి గొడుగుల ఊరేగింపు



భావనారుషి ఆలయానికి గొడుగును వితరణగా అందిస్తున్న ట్రస్టు సభ్యులు

నాగలాపురం, న్యూస్‌టుడే: తమిళనాడులోని తిరునిండ్రయూర్ శ్రీమత్ రామానుజ కైంకర్య ట్రస్టు ఆధ్వర్యంలో తిరుమల శ్రీవారికి గరుడసేవకు అందించనున్న గొడుగులను ఆదివారం నాగలాపురం, పిచ్చాటూరులలో ఊరేగించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి విగ్రహాలతో కూడిన వాహనాన్ని ట్రస్టు నిర్వాహకులు ఊరేగింపుగా తీసుకెళ్లారు. నాగలాపురంలోని భద్రావతి సమేత భావనారుషి ఆలయానికి గొడుగును ట్రస్టు సభ్యులు వితరణగా అందించారు. దామోదరం మొదలియార్, విజయకుమార్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇళంగోవన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

బంధువులే హత్యచేశారా..?

ఏర్పేడు, న్యూస్‌టుడే: రేణిగుంట మండలం మొలగమూడి ఎస్సీకాలనీకి చెందిన ప్రవీణ్(35)శనివారం ఏర్పేడు మండలంలోని ఇరుకలప్పచలం సమీపంలో హత్యకు గురికావడంతో పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆదివారం పలువురి అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టే పనిలో నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలోనే బంధువులే హత్యకు పాల్పడినట్లు గుర్తించినట్లు సమాచారం. అయితే హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

గూడూరు
•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

గూడూరులో నిమ్మ ధరలు



మొదటి రకం: కేజీ రూ. 60 నుంచి రూ. 80 వరకు
రెండో రకం: కిలో రూ. 50 నుంచి రూ. 60 వరకు

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

బ్రాయిలర్	134
లేయర్	110
బ్రాయిలర్స్	240
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	264
లేయర్ మాంసం	187

8న మహాసభలు

గూడూరుపట్టణం: ఈ నెల 8న నిర్వహించే వ్యవసాయ కార్మిక మహాసభలు విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ తెలిపారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో కరపత్రాలను ఆదివారం విడుదల చేశారు.

కాలగంధలో సామూహిక పొంగళ్లు

బాలాయపల్లి, న్యూస్‌టుడే: కాలగంధ గ్రామ దేవత కాలగంధమ్మకు ఆదివారం సామూహిక పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. తెదేపా నేతలు సింగంశెట్టి భాస్కరరావు, రాయి సత్యం, చంద్రమౌళిరెడ్డి, పోలంరెడ్డి కోటిరెడ్డి, గురువేంద్ర నాయుడు, వైకాపా మండల కన్వీనర్ కార్తీక్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు : 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 96188 78782
వెంకటగిరి : 80085 73966
సమయం 10 AM TO 1 PM

కోట, న్యూస్‌టుడే:
సమస్య: కోటలోని ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. అధికారులకు వినతులు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. - స్థానికుడు
సమాధానం: పరిశీలించి సమస్యను త్వరలో పరిష్కరిస్తాం. - భవాని, ఎంపీడీవో

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే
సమస్య: సూళ్లూరుపేట పురపాలక సంఘంలోని మన్నారుపోలూరుకు వెళ్లే శ్రీకాళహస్తి రోడ్డులో వీధి దీపాలు వెలగడం లేదు. చీకట్లో రాకపోకలు సాగించాల్సి వస్తోంది. - కె.రవీంద్ర, మన్నారుపోలూరు
సమాధానం: సచివాలయ సిబ్బందిని క్షేత్రస్థాయికి పంపి, పరిశీలించి, వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - చిన్నయ్య, పుర కమిషనర్

నాయుడుపేట, న్యూస్‌టుడే:
సమస్య: పట్టణంలోని బీడీ కాలనీలో సీసీ రోడ్లు గుంతలు పడి అధ్వానంగా ఉన్నాయి కాలువల్లో పూడిక చేరింది. - సంతోష్, స్థానికుడు
సమాధానం: కాలనీలోని సమస్యను పరిశీలించి పరిష్కరిస్తాం. - ఫజులుల్లా కమిషనర్ నాయుడుపేట

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే:
సమస్య: పట్టణంలోని రాణిపేట ప్రాంతంలో డ్రైనేజీ కాలువలో మురుగునీరు ముందుకు కదలడం లేదు. దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నిల్వలు దోమలకు ఆవాస కేంద్రాలుగా మారడంతో స్థానికులు రోగాలు బారినపడాల్సి వస్తోంది. - గురుమూర్తి, గూడూరు
సమాధానం: సిబ్బంది ద్వారా కాలువల్లో పూడిక తొలగిస్తాం. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. - వెంకటేశ్వర్లు, కమిషనర్, గూడూరు

పాఠశాల ఆవరణ చదును



పాఠశాల ఆవరణను శుభ్రం చేయిస్తున్న తెదేపా నేత చక్రపాణి, స్థానికులు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: మండలంలోని కాపులూరు ఉన్నత పాఠశాల ఆవరణను స్థానిక తెదేపా నాయకుడు చక్రపాణి తన సొంత నిధులతో చదును చేయించారు. ఇక్కడి ఉన్నత పాఠశాల సమస్యను స్థానికులు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె చొరవ తీసుకుని పాఠశాల ఆవరణ ఆనుకుని ఉన్న రైతుకు చెందిన ఐదు సెంట్లు భూమిని పాఠశాలకు ఇచ్చేలా మాట్లాడారు. చెన్నై వాసి తంగిచ్చి బాలాజీ శెట్టి పాఠశాలకు వితరణ చేశారు. స్థానిక తెదేపా నాయకుడు చక్రపాణి చొరవ తీసుకుని ఆవరణను యంత్రాలతో చదును చేయించారు. పాఠశాల బాగుకు కృషి చేశారు.

సంప్రదాయం తప్పితే చర్యలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ దర్శనార్థం వచ్చే భక్తులు సంప్రదాయ వస్త్రధారణ, తిలకధారణ ఇకపై విధిగా అమలు చేసేలా ఈవో చంద్రశేఖర్ ఆజాద్ ఆదేశించారు. భక్తులు పాటించేలా చర్యలు తీసుకోవాలని, అలా కాకుండా సంప్రదాయ వస్త్రధారణ లేకుండా దర్శనాలకు అనుమతిస్తే సంబంధిత అధికారులపై చర్యలు ఉంటాయని ఆదివారం ఇచ్చిన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. స్వామి, అమ్మవార్లకు నిర్వహించే రాహు, కేతు పూజలు చేయించుకునే భక్తులు విధిగా సంప్రదాయ వస్త్రాలతో హాజరు కావాల్సి ఉందన్నారు. భక్తులకు అవగాహన కోసం ఇంజినీరింగ్ శాఖ ఆలయంతో పాటు పట్టణంలోని ప్రధాన కూడళ్లల్లో సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ ప్రవేశ ద్వారాలతో పాటు మహద్వారం వద్ద విభూదీ, కుంకుమ, చందనం అందుబాటులో ఉంచాలని, ప్రతి ఒక్కరూ వాళ్లకు ఇష్టమైన దాన్ని ధరించి ఆలయంలో స్వామి, అమ్మవార్లను దర్శనం చేసుకోవాలని సూచనలు చేశారు.

నాడు-నేడు పూర్తయ్యేదెన్నడో..?

- చేసిన పనులకు నిధుల గండం
- వైకాపా నిర్లక్ష్యంతో ముందుకు రాని గుత్తేదారులు

వాకాడు, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో పాఠశాలలు, వైద్యశాలల్లో ప్రవేశ పెట్టిన నాడు-నేడు పనులపై అప్పటి ప్రజాప్రతినిధులు సభలు, సమావేశాల్లో ఎంతో గొప్పగా ఊదరగొట్టారు. ఆ మాటలు క్షేత్ర స్థాయిలో అందుకు భిన్నంగా ఉన్నాయి. చేపట్టిన పనులకు నిధులు సక్రమంగా విడుదల చేయకపోవడంతో అటు విద్యా, వైద్య శాఖలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. నిధులు విడుదల కాకపోవడంతో పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. మరికొన్ని నేటికీ మొదలు పెట్టని దుస్థితిలో ఉన్నాయి.

గూడూరు నియోజకవర్గంలో 2020-21 వైకాపా హయాంలో నాడు-నేడు కింద ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఐదు నూతన భవనాలు మంజూరు చేశారు. ఇందులో రెండు భవనాలు పూర్తయ్యాయి. మిగిలిన మూడు నిర్మాణాలు అసంపూర్తిగానే ఉన్నాయి. ఇందుకు ప్రధాన కారణం అప్పటి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో గుత్తేదారు పనులను అసంపూర్తిగా వదిలేశారు.

నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి..

వైకాపా ప్రభుత్వంలో చిల్లకూరు, చిల్లకూరు మండలం చింతవరం, వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం, చిట్టమూరు, చిట్టమూరు మండలం మల్లాం గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు నూతన భవనాలను నాడు-నేడు పనుల కింద మంజూరు చేశారు. ఒక్కో భవనానికి రూ.1.70 కోట్ల వరకు నిధులు కేటాయించారు. దాంతో చిల్లకూరు, చింతవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలను పూర్తి చేశారు. మిగిలిన బాలిరెడ్డిపాలెం, చిట్టమూరు, మల్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణాలను పునాదులకే పరిమితం చేశారు. రూ.1.90 కోట్లతో చేపట్టిన బాలిరెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన పనులకు తీసుకొచ్చిన సిమెంటు బస్తాలు పర్యవేక్షణా లోపం కారణంగా గడ్డకట్టి మూలకు చేరాయి. చిట్టమూరు, మల్లాం భవనాల పనులకు గుత్తేదారుకు రూ.46 లక్షలు నిధులు విడుదల చేసి చేతులు దులుపుకొన్నారు. పనులు చేసినా పూర్తి బిల్లులు రాకపోవడంతో గుత్తేదార్లు పనులను అర్ధాంతరంగా వదిలేశారు. బాలిరెడ్డిపాలెం, చిట్టమూరు, మల్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రస్తుతం పాత భవనాల్లో కొనసాగుతున్నాయి. వర్షాకాలంలో సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు.



ఆసుపత్రి ఆవరణలో గడ్డకట్టిన సిమెంటు బస్తాలు



మూడేళ్లుగా పునాదులకే పరిమితమైన ఆసుపత్రి భవన పనులు

ప్రతిపాదనలు పంపాం

నియోజకవర్గంలో ఐదు భవనాలకు రెండు భవనాలు పూర్తి చేశాం. మూడు భవనాలకు నిధులు విడుదల చేయలేదు. దాంతో ఆ పనులను రద్దు చేశాం. మరలా భవన నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపుతాం. నిధులు విడుదల కాగానే పనులు చేపడతాం.
- రామాంజనేయులు, ఈఈ రభ, గూడూరు

అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మణ్ని

తడ, న్యూస్‌టుడే: తడ మండలం వాటంబేడులో ఆదివారం అమ్మణ్ని విశాలాక్షి దేవి అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక ప్రసన్న కాశీవిశ్వేశ్వరాలయంలో అమ్మణ్నికి ఉదయం సర్వాభిషేకాల అనంతరం కుంకుమపూజ నిర్వహించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.



శునకాల స్వైర విహారం

పురపాలక పరిధిలో శునకాలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా ప్రధాన వీధుల్లో తిరుగుతున్నాయి. పాఠశాలల విద్యార్థులు రాకపోకలు సాగించే సమయంలో వెన్నవెంట పరుగులు తీస్తూ భయాందోళనకు గురిచేస్తున్నాయి. దర్గా కూడలి, బీడీకాలనీ, పడమరవీధి, మార్కెట్టు సెంటరు, ఆర్టీసీ బస్టాండు ఎదురుగా జాతీయ రహదారి కూడలిలో రోడ్డుపై నిలబడి వాహనాలకు అడ్డంగా నిలబడుతున్నాయి. పలువురిని కరిచిన దాఖలాలు ఉన్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం



వాగు అంచున రోడ్డు.. అడిగేదెవరులే!

చిట్టమూరు మండలం యాకసిరి చెరువులో మట్టి తరలించేందుకు వీలుగా వరద నీరు వెళ్లే వాగు అంచున కొందరు రియల్ వ్యాపారుల ప్రోత్సాహంతో రోడ్డు నిర్మించడం వివాదంగా దారితీస్తోంది. దీని వల్ల నాయుడుపేట మండలంలో నరసారెడ్డికండ్రిగ పెరికలపాటి కండ్రిగ పొలాల్లోకి వరద నీరు చేరుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. - న్యూస్‌టుడే, నాయుడుపేట

ఎడారిని తలపిస్తున్న స్వర్ణముఖి

ఆశ్వయుజ మాసంలో జలకళతో ఉండాల్సిన స్వర్ణముఖి తీరం ఎడారిని తలపిస్తోంది. ఈ ప్రాంతంలో రాత్రీపగలు ఎడ్లబండ్ల ద్వారా ఇసుక తరలించడం వల్ల పట్టణానికి దగ్గరగా ఉన్న నదీ తీరాన ఇసుక రేణువులు లేకుండా మట్టిగా మారి ఇందులో చెట్లు పెరిగి ఎడారిగా కనిపిస్తోంది. - న్యూస్‌టుడే, నాయుడుపేట





తుప్పుపడుతున్నా.. పట్టించుకోరా

కోట సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో 104, 108 వాహనాలు నిరుపయోగంగా ఉన్నాయి. సంవత్సరాలుగా వినియోగానికి దూరం కావడంతో తుప్పు పడుతున్నాయి. విషయాన్ని 104, 108 నిర్వాహక అధికారులకు చెబుతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో విలువైన వాహనాలు ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. 104, 108 వాహనాలు మరమ్మతులకు గురికావడంతో ఆసుపత్రి ప్రాంగణంలో మూలన పడేశారు. సంబంధిత అధికారులు స్పందించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై సామాజిక ఆరోగ్య కేంద్ర వైద్యులను వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. - న్యూస్‌టుడే, కోట

రైల్వే బోర్డు సభ్యుడిగా భాజపా నాయకుడు కృష్ణయ్య

వాకాడు, న్యూస్‌టుడే: తిరుమూరుకు చెందిన భాజపా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పాముంజ కృష్ణయ్యను రైల్వే బోర్డు సభ్యుడిగా నియమించారు. ఆ మేరకు రైల్వే అధికారుల నుంచి ఆదివారం గుర్తింపు కార్డును అందుకున్నారు. తొలి నుంచి భాజపాలో సీనియర్ కార్యకర్తగా ఉంటూ పార్టీకి చేసిన సేవలను గుర్తించిన అధిష్ఠానం ఆయనకు రైల్వే బోర్డు సభ్యుడిగా నియమించింది. పార్టీ కార్యకర్తలు, నేతలు ఆయనకు అభినందనలు తెలిపారు.



గుర్తింపు కార్డు అందుకుంటున్న కృష్ణయ్య



మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్


పొరపాట్లు లేకుండా దుకాణాల కేటాయింపు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: కొత్త మద్యం విధానంలో ఎటువంటి అవకతవకలు లేకుండా దుకాణాల కేటాయింపులు జరుగుతాయని చిత్తూరు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ పేర్కొన్నారు. నాయుడుపేట కార్యాలయంలో జిల్లా, స్థానిక అధికారులతో ఆదివారం సమావేశమయ్యారు. కొత్త పాలసీ ద్వారా మద్యం దుకాణాల కేటాయింపులో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా కేటాయింపులు చేస్తామన్నారు. మరింత సమాచారం కోసం టోల్‌ఫ్రీ నంబరు 040-42425520ను సంప్రదించాలన్నారు.

చిల్లర సర్దుబాటుకు ఉత్తర్వులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున చేస్తున్న పార్కింగ్ సిబ్బంది సౌకర్యార్థం చిల్లర సర్దుబాటు చేస్తూ ఆలయ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కారు జీపునకు రూ.59కి బదులుగా రూ.60, ఇన్నోవ, స్కార్పియో, సుమోలకు రూ.71కి బదులు రూ.70, మినీబస్సుకు రూ.118కి బదులు రూ.120, బస్సు, లారీలకు రూ.177కు బదులు రూ.180గా సర్దుబాటు చేశారు.

వాడవాడలా దేవీశరన్నవరాత్రి వేడుకలు



సూళ్లూరుపేట: అన్నపూర్ణాదేవి అలంకారంలో కన్యకాపరమేశ్వరి




చిల్లకూరు: కలవకొండలో ధైర్యలక్ష్మిగా..



చిల్లకూరు: మోహినీదేవి అలంకారంలో



సూళ్లూరుపేటలో..



వాకాడులో..



కోట: ప్రత్యేక అలంకారంలో కోటమ్మ దేవత



కోట: అన్నపూర్ణాదేవి అలంకారంలో



గూడూరుపట్టణం: మోహినీ అలంకరణలో

దేవీశరన్నవరాత్రి పూజల్లో భాగంగా ఆదివారం శక్తి ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించి అభిషేక పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. - న్యూస్‌టుడే, బృందం

తాళ్వాయపాడులో పెరటాసి మాసోత్సవం

పెళ్లకూరు, న్యూస్‌టుడే: తాళ్వాయపాడులో పెరటాసి మాసం సందర్భంగా ఆదివారం తెల్లవారుజామున శ్రీవేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక మహాలక్ష్మమ్మ ఆలయం నుంచి ప్రారంభమైన గ్రామోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



గ్రామోత్సవంలో స్వామివారు

నేడు దిష్టిచుక్క ఉత్సవం



వెంకటగిరి, న్యూస్‌టుడే: గ్రామశక్తి కలివేలమ్మ అమ్మవారికి సోమవారం దిష్టిచుక్క కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దసరా మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంచా కుటుంబసభ్యులు అధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. మందనాంచారేశ్వరి దేవి అమ్మవారు అన్నపూర్ణదేవిగా, పర్వతవర్ధిని అమ్మవారు రాజరాజేశ్వరి అలంకరణలో, మీనాక్షిదేవి అలంకరణలో కాత్యాయని అమ్మవారు, కల్యాణ వెంకటేశ్వరస్వామి నరసింహ అవతారంలో దర్శనమిచ్చారు.

చదరంగంలో ప్రతిభ

వెంకటగిరి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయం రాష్ట్రస్థాయిలో నిర్వహించిన చదరంగం పోటీలో వెంకటగిరి విద్యార్థి శ్రీహరి ప్రతిభ చాటాడు. శనివారం నెల్లూరులో జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో శ్రీహరి 5 రౌండ్లకు 4 రౌండ్లు గెలిచి 9వ స్థానంలో నిలిచాడు. క్రీడాకారుడిని సీఐ వెంకటరమణ ఆదివారం ప్రత్యేకంగా అభినందించారు.



శ్రీహరిని అభినందిస్తున్న సీఐ వెంకటరమణ

వృత్తి విద్యా కోర్సులతో ఉపయోగం

బీఎన్‌కండ్రిగ: వృత్తి విద్యా కోర్సులు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణయ్య అన్నారు. విద్యార్థులతో కలిసి ఆదివారం మీసేవా కేంద్రాన్ని సందర్శించారు.

వంతెన నిర్మాణం.. ప్రతిపాదనలకే పరిమితం

☛ ఏళ్లుగా సమస్య ☛ ఇబ్బందుల్లో ప్రజలు

బాలాయపల్లి, న్యూస్‌టుడే: అనేక మండలాలను కలిపే రహదారులు.. శిథిలావస్థకు చేరిన కాజ్‌వేల కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సంవత్సరాలుగా వంతెన కోసం ప్రతిపాదనలు పంపుతున్నా.. నిధులు మంజూరు కాకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. బాలాయపల్లి మండలం నిడిగల్లుకు సమీపంలోని నక్కల వాగుపై కాజ్‌వే పరిస్థితి ఇదీ..

వెంకటగిరి పట్టణం బంగారుపేట నుంచి పిగిలాం మీదుగా హస్తకావేరి మధ్య మొత్తం 17 కి.మీ. రోడ్డు ఇది. ఈ రహదారి గుండా హస్తకావేరి నుంచి ఉత్తరం వైపు జయంపు మీదుగా ఓజిలి, గూడూరు మండలాలకు.. దక్షిణం వైపున మేల్చూరు కూడలిలో కలిసి వెంకటగిరి-నాయుడుపేట మార్గాలకు చేరుకోవచ్చు. అయితే నిడిగల్లుకు సమీపంలోని నక్కలవాగుపై ఉన్న పురాతన కాజ్‌వే 2015 వరదలకు కొంత కుంగిపోయింది. అప్పట్లో మట్టితో పూడ్చి మమ అనిపించారు. తర్వాత కాలంలో మరింత అధ్వాన్నంగా తయారైంది. ప్రస్తుతం ఓ భాగం కుంగి గుంత పడింది. స్థానికులే ప్రమాద హెచ్చరికగా రాళ్లు పెట్టారు.



నిడిగల్లు వద్ద శిథిలావస్థకు చేరిన కాజ్‌వే



ప్రమాదకరంగా గుంత

రూ.3 కోట్లతో ప్రభుత్వానికి నివేదించాం

నిడిగల్లు దగ్గర కాజ్‌వేను తొలగించి వంతెన కోసం రూ.3 కోట్ల అంచనాలతో ప్రభుత్వానికి నివేదించాం. సీఆర్ఎఫ్(సెంట్రల్ రోడ్స్ ఫండ్స్) కోటాలో ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రతిపాదనలు పంపాం. టెండర్లు నిర్వహించి పనులు చేయాల్సి ఉంది.
- బాబు, ఏఈ, రభ శాఖ, బాలాయపల్లి

విద్యుత్తు నియంత్రికల చోరీ

వాకాడు, న్యూస్‌టుడే: మండలంలోని తిరుమూరులో రొయ్యల గుంతల వద్ద ఉన్న విద్యుత్తు నియంత్రికల్లోని విలువైన వస్తువులను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేస్తున్నారు. ఇప్పటివరకు 10 నియంత్రికల్లో వస్తువులు చోరీకి గురైనట్లు బాధిత ఆక్వా రైతులు వాపోయారు. ఆ మేరకు విద్యుత్తు అధికారులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. తిరుమూరులో ప్రస్తుతం ఆక్వా సాగు లేకపోవడంతో ఖాళీగా ఉన్న గుంతల వద్ద విద్యుత్తు నియంత్రికల్లోని రాగి వైరు, ఆయిల్, ఇతర విలువైన వస్తువులను చోరీ చేసి నియంత్రికను తొలగిస్తున్నారని రైతులు పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉందని వాపోయారు. చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పీఆర్ డివిజన్‌లో ఏఈల కొరత

కదలిక లేని అభివృద్ధి పనులు

నాయుడుపేట, న్యూస్‌టుడే: గ్రామాభివృద్ధికి కీలకమైన పంచాయతీ రాజ్ డివిజన్‌లో సహాయక ఇంజినీరింగ్ అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో గ్రామాల్లోని అభివృద్ధి పనుల్లో కదలిక లేకుండా పోయింది. నాయుడుపేట పంచాయతీరాజ్ సబ్ డివిజన్ పరిధిలో నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి, దొరవారిసత్రం, తడ మండలాలున్నాయి. ప్రతి మండలానికి పీఆర్ ఏఈ ఉంటారు. వీరు గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ పాలకవర్గాలు ఆమోదం తెలిపిన రోడ్లు, భవనాలు, మౌలిక వసతుల పనులను పూర్తి చేయిస్తారు.

రెండేళ్లుగా అన్నీ మండలాల్లో కీలకమైన పీఆర్ ఏఈల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇటీవల ఇద్దరు ఏఈలు ఉండగా వీరిలో ఒకరు పదవీ విరమణ... మరొకరు బదిలీ కావడంతో నాయుడుపేట ఏఈలు లేని పీఆర్ సబ్ డివిజన్‌గా మారింది.



నాయుడుపేట పంచాయతీరాజ్ సబ్ డివిజన్ కార్యాలయం

నత్తనడకన సాగుతూ..

కూటమి ప్రభుత్వం తాజాగా మండలానికి రూ.2కోట్ల వరకు సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి నిధులు విడుదల చేసింది. అదనంగా ఒక్కో మండలానికి మరో రూ.2 కోట్లు విడుదల చేసే అవకాశం ఉంది. గత ప్రభుత్వంలో అసంపూర్తిగా ఉన్న సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, అంగన్‌వాడీ తదితర భవనాలు పూర్తి చేయాల్సి ఉంది. ప్రధానమంత్రి సడక్ యోజన, నాబార్డు ఏడీబీ నిధులకు సంబంధించిన లింకు రోడ్ల పనులు జరగాల్సి ఉంది. అయితే ఏఈల కొరత తీవ్రంగా ఉండటంతో అవసరమైన అంచనాలు, నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

కొన్ని చోట్ల సచివాలయ పరిధిలో ఉన్న సహాయ ఇంజినీర్లు పనులు చేసే దగ్గర ఉన్నప్పటికీ వీరికి పూర్తిస్థాయి పరిజ్ఞానం లేకపోవడంతో పనుల్లో పురోగతి అస్తవ్యస్తంగా మారింది. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకొని మండలస్థాయిలో పీఆర్ ఏఈలను నియమించాలని పలువురు గ్రామ పంచాయతీల సర్పంచులు కోరుతున్నారు.



పుస్తకావిష్కరణలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి, కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, తితిదే ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి తదితరులు

సింహవాహన సేవలో ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో మూడో రోజు ఆదివారం ఉదయం జరిగిన సింహ వాహన సేవలో నాలుగు ఆధ్యాత్మిక పుస్తకాలను కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి, తితిదే ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి తదితరులు ఆవిష్కరించారు. మారెళ్ల వెంకట శేషారెడ్డి రచించిన 'శ్రీ భాగవతము-ప్రశ్నావళి', డా.కప్పగంతుల రామకృష్ణ రచించిన 'హైందవ సంస్కృతి- వైజ్ఞానికత', డా.పుట్టపర్తి నాగపద్మిని రచించిన 'తిరుమల తిరుపతి క్షేత్ర మహత్మ్యం(హిందీ)', వావిలి కొలను సుబ్బారావు రచించిన 'శ్రీమదొంటిమిట్ట కోదండరామ మహత్మ్యం-వివరణ' పుస్తకాలను ఆవిష్కరించారు.

వాహనదారులకు జరిమానాలు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులపై కొరడా ఝుళిపించారు. సీఐ హరిప్రసాద్ ఆధ్వర్యంలో 28 వాహనాలకు రూ.35,560 జరిమానా విధించారు. చిలకలూరిపేటకు చెందిన సురేష్, అతని వెంటవచ్చిన 14 మందిని రాంభగీచా నుంచి శిలాతోరణం సర్వదర్శనం క్యూలైన్‌లో దింపేందుకు టెంపో డ్రైవర్ ఏకంగా రూ.500 వసూలు చేయడంతో ట్రాఫిక్ పోలీసులు అతడిని గుర్తించి ఆర్టీవోకు అప్పగించారు.

వనరాజు.. పావన రారాజు



ఆనంద నిలయం వీడి, భక్తుల చెంతకే కదిలి వస్తున్న ఆ వైకుంఠవాసుడి బ్రహ్మోత్సవాలు అంబరాన్నంటుతున్నాయి. స్వామివారి ముగ్ధమనోహర రూపాన్ని వీక్షించడానికి క్షణమైన చాలు అంటూ లక్షల మంది భక్తులు మాడవీధుల్లో వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఆదివారం స్వామివారి సింహ, ముత్యపు పందిరి వాహనసేవల్లో పాల్గొని తన్మయత్వం పొందారు. వాహనం ఎదుట గజరాజులు నడుస్తుండగా, భక్త బృందాల ప్రదర్శనలు, జీయంగార్ల వేదఘోష్ఠి, మంగళ వాయిద్యాలు మిన్నంటిన వేళ సప్తగిరులూ పరవశించాయి.

- న్యూస్‌టుడే, తిరుమల



వాహనసేవల్లో భాగంగా సాంస్కృతిక ప్రదర్శనలిస్తున్న కళాకారులు

క్రీడా అకాడమీల ఏర్పాటుకు నిధులు



శాప్ ఛైర్మన్ రవినాయుడును గజమాలతో సత్కరించిన ప్రవీణ్, శ్రీధర్ తదితరులు

శాప్ ఛైర్మన్ రవినాయుడు

తిరుపతి (క్రీడలు), న్యూస్‌టుడే: క్రీడలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ (శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. తిరుపతిలోని శ్రీనివాస క్రీడా సముదాయం వేదికగా ఆదివారం సాయంత్రం అండర్- 14, 17 స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి తైక్వాండో బాలబాలికల పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీలకు ఉమ్మడి 13 జిల్లాలకు చెందిన 700 మంది బాలబాలికలు, శిక్షకులు తరలివచ్చారు. ముఖ్యఅతిథిగా రవి నాయుడు పోటీలను ప్రారంభించారు. రాష్ట్రంలో నూతనంగా క్రీడా అకాడమీల ఏర్పాటు, ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రాలకు కావాల్సిన నిధులను సమకూర్చడానికి కృషి చేస్తామన్నారు.




ఊకా విజయకుమార్‌కు శ్రీవారి ప్రతిమను అందజేస్తున్న చిన్నంగారి రమణ

బాధ్యతలు సమర్థంగా నిర్వర్తించాలి

తిరుపతి (నగరం, బైరాగిపట్టెడ): పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల సంస్థ డైరెక్టర్ ఊకా విజయకుమార్ ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని విశ్రాంతి డిప్యూటీ ఈవో చిన్నంగారి రమణ అన్నారు. విజయకుమార్‌ను ఆదివారం కలిసి సత్కరించి శ్రీవారి ప్రతిమను అందజేశారు. రవికుమార్, రామారావు, మధుసూదన్, రాఘవేంద్ర, కోటేశ్వరరావు, నెహ్రూరాజు పాల్గొన్నారు.

భక్తితో తరించి.. సర్వం సమర్పించి

1150 వరకు శాసనాల్లో శ్రీవారి విశేషాలు



తిరుమల, తిరుపతిలో పలు గోడలపై శాసనాలు

ఈనాడు డిజిటల్, తిరుపతి: కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వర స్వామి నిత్య కైంకర్యాలకు నెయ్యి వినియోగం శతాబ్దాలుగా కొనసాగుతోంది. స్వామివారి పూజా కార్యక్రమాల్లో నైవేద్యాలకు అత్యంత విశిష్టత ఉంది. వాటి తయారీ, ఇతర సేవల గురించి శాసనాల్లో ప్రస్తావన ఉంది. 1150 వరకు ఉన్న శాసనాల్లో అధికశాతం తిరుమల, తిరుపతిలోని ఆలయ ప్రాకారంపై కనిపిస్తాయి. అవన్నీ 8 నుంచి 18వ శతాబ్ద కాలానికి చెందినవే.

పల్లవ, చోళ, పాండ్య, కడవరాయలు, యాదవరాయలు, విజయనగర రాజులు, మంత్రులు, సామంతులు స్వామిని ఎంతో భక్తితో సేవించి తరించారు. పెద్దఎత్తున విరాళాలు సమర్పించారు. ఆ వివరాలు శాసనాల్లో పొందుపరిచారు. స్వామివారికి చెందిన భూముల్లో పండించే పంటలను పండగలు, బ్రహ్మోత్సవాల సందర్భంగా నైవేద్యాలు తయారు చేసేందుకు వినియోగించేవారు. ఆ సందర్భంలో పాటించాల్సిన నియమాలు, సంప్రదాయాలు, వంటగది నాణ్యత, కొలతలకు సంబంధించిన వివరాలను కూలంకుషంగా ప్రస్తావించారు.

నైవేద్యానికి పెద్దఎత్తున విరాళాలు..

పల్లవ వంశానికి చెందిన కడవన్ పెరుందేవి అనే రాణి శ్రీవారికి ఆహార నైవేద్యాలు అందించేందుకు అవసరమైన భూమి కొనుగోలు నిమిత్తం 4,176 బంగారు నాణేలు విరాళంగా అందించారు. ఇలా అనేకమంది రాజులు 18వ శతాబ్దం వరకు పెద్దఎత్తున విరాళాలు సమర్పిస్తూ వచ్చారు. విజయనగర సామ్రాజ్యాధిపతి శ్రీకృష్ణదేవరాయలు సామాన్య శకం 1509 నుంచి 1529 వరకు ఏడుసార్లు తిరుమలను సందర్శించారు. ఆయన తన సతీమణులు తిరుమలదేవి, చిన్నాదేవిలతో కలిసి వజ్ర వైడూర్యాలు సమర్పించారు. నైవేద్యాల సమర్పణకు బంగారు పాత్రలు బహూకరించారు.

● 1019లో తిరుమల మొదటి ప్రాకారంలోని ఉత్తర గోడపై ఉన్న శాసనం రాజేంద్ర చోళుడు-1 తమిళంలో వేయించారు. ఇందులో నెయ్యి తరలింపు, స్వామివారి సేవకు వినియోగించే విధానం గురించి ప్రస్తావించారు. స్వామివారికి 24 నేతి దీపాలు వెలిగించే వారిని వెల్లడిస్తుంది. అప్పట్లో 'తిరువేంగడ దేవర్'గా కొలిచిన శ్రీవారికి నిత్య సేవలు సభ ఆధ్వర్యంలో జరిగేవి. వాటిని సక్రమంగా చేపట్టడం లేదని గుర్తించి విచారణ అనంతరం వారి ఆధీనంలో ఉన్న నెయ్యి, నిధులను దేవాలయ భాండాగారానికి ఇవ్వాల్సిందిగా ఆదేశించడంతోపాటు దేవాదాయాధికారులు దీపారాధన చేయాల్సిందిగా స్పష్టం చేసినట్లు వెల్లడవుతోంది.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం

తిరుపతి (కలెక్టరేట్): కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం పది గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ డా.వెంకటేశ్వర్ తెలిపారు. జిల్లాస్థాయి అధికారులు తప్పకుండా కార్యక్రమానికి హాజరుకావాలన్నారు. అర్జీదారులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వైద్య శిబిరానికి స్పందన



తిరుపతి (వైద్య విభాగం), న్యూస్‌టుడే: స్థానిక జీఎస్ మాడావీధిలోని వెంకటసాయి హృదయాలయ ఆసుపత్రి వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చినట్లు హాస్పిటల్ అధినేత డా.యుగందర్ బచ్చు తెలిపారు. 200 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	124
రిటైల్	146
లేయర్	110
బ్రాయిలర్స్	212
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	241
లేయర్ మాంసం	187

రైలుబండి కష్టాలు

- ● శ్రీవారి బ్రహ్మోత్సవాలు, దసరా సెలవులతో రద్దీ
- ● కీలకమైన రూట్లలో దొరకని బెర్తులు

రోజువారీ రైళ్లు: 90 పైగా
ప్రయాణికులు: 1.20 లక్షలు

తిరుపతి (రైల్వే), న్యూస్‌టుడే: అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవాలను తిలకించడానికి దేశం నలమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. నిత్యం వందలాది రైళ్లు తిరుపతి, రేణిగుంట మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. తిరుపతికి చేరుకోవాలంటే ఎక్కువ మంది రైలు ప్రయాణాన్నే ఆశ్రయిస్తుంటారు. కానీ ఏ రైలు చూసినా.. ప్రయాణికులతో కిక్కిరిసిపోతోంది. రద్దీకి అనుగుణంగా అదనపు రైళ్లు, బోగీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. దేశం నలమూలల నుంచి వచ్చే యాత్రికులకు స్థానిక ప్రాంగణంలో వసతులు పెంచాల్సిన అవసరం ఉంది.

ప్రత్యేక రైళ్లలోనూ...: దసరా, దీపావళి, క్రిస్మస్ పండుగలను పురస్కరించుకుని ద.మ.రైల్వే ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. అక్టోబరు, నవంబరులో తిరుపతి నుంచి సికింద్రాబాద్, కాచిగూడ, విశాఖపట్నం, షిరిడీ, మచిలీపట్నం, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లను నిర్దేశించిన తేదీల్లో నడపనుంది. వీటిలో విశాఖపట్నం, శ్రీకాకుళం, కాచిగూడ రైళ్లకు వెయిటింగ్ లిస్టు, ఆర్ఏసీ చూపుతోంది.

ఈ రైళ్లకు అధిక డిమాండ్: తిరుపతి నుంచి రోజువారీ రాకపోకలు సాగించే నారాయణాద్రి, వెంకటాద్రి, శబరి, పద్మావతి, రాయలసీమ, కృష్ణా, తిరుమల ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అధిక డిమాండ్ ఉంటోంది. వీటిలో సికింద్రాబాద్, కాచిగూడ, నల్గొండ, విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, ఒంగోలు, కర్నూలు, అనంతపురం, నిజామాబాద్ తదితర ప్రాంతాల నుంచి వేలాదిమంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం బ్రహ్మోత్సవాలు, దసరా, దీపావళి సెలవుల నేపథ్యంలో వెయిటింగ్ లిస్టు చాంతాడంత ఉంది. కొన్ని రైళ్లకు రిగ్రెట్ చూపుతోంది. కేరళ, పూరి, హౌరా, షిరిడీ, శ్రీకాకుళం, చెన్నై నుంచి వచ్చే రైళ్లలో బెర్తులు దొరకడం గగనమైంది. ఉత్తర భారత దేశ భక్తులు గూడూరు జంక్షన్‌పైనే ఎక్కువగా ఆధారపడాల్సి వస్తోంది.



రైల్వే ప్రాంగణంలో ప్రయాణికుల పాట్లు

■ **ప్రాంగణంలో అరకొర వసతులు..:** బ్రహ్మోత్సవాలు, సెలవుల నేపథ్యంలో తిరుపతి స్టేషన్‌లో వసతులు, సౌకర్యాలు పెంచాల్సిన ఉన్నా.. ఆధునికీకరణ పనుల పేరుతో అధికారులు దాట వేస్తున్నారు. ఉత్తరం వైపు భవనాలను పూర్తిగా కూల్చివేయడంతో సరిపడా వెయిటింగ్ హాళ్లు, మరుగుదొడ్లు లేక ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ప్లాట్‌ఫామ్‌లపై నిర్మాణ పనులు జరుగుతుండటంతో ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు.

■ **తప్పని దొంగల బెడద:** శ్రీవారి దర్శనానంతరం తిరుగు ప్రయాణంలో రైలు ఎక్కేందుకు వేచి ఉండే ప్రయాణికులకు దొంగల బెడద తప్పడం లేదు. కళ్లుమూసి తెరిచేలోపే బ్యాగులు, సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు చోరీ చేస్తున్నారు. సాధారణ బోగీల్లో రైలు ఎక్కే సమయంలో జేబు దొంగలు పర్సులు నొక్కేస్తున్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నారుల మెడలోని గొలుసులు సైతం చోరీ చేస్తున్నారు.

■ **కల్తీ ఆహారం సరేసరి:** రైల్వే స్టేషన్‌తోపాటు ఎదురుగా ఉన్న హోటళ్లలో ఆహార నాణ్యత, ధరలపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఉదయం వండిన సాంబారును రాత్రి వరకు వేడి చేస్తూనే ఇడ్లీ, దోసె, అన్నంలోకి పోస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్లాట్‌ఫాంలపై విక్రయించే పదార్థాల్లో నాణ్యత లేవని ఆరోపిస్తున్నారు.

■ **ఆటోవాలాల దోపిడీ...:** దేశ నలమూలల నుంచి తిరుపతికి వచ్చీరాగానే పర్యటకులను, యాత్రికులను ఆటో డ్రైవర్లు దోచుకుంటున్నారు. రైలు దిగడం మొదలు బస కేంద్రానికి వెళ్లాలన్నా, స్థానిక పుణ్యక్షేత్రాలైన తిరుచానూరు (అలిమేలు మంగాపురం),గోవిందరాజస్వామి ఆలయం, కోదండ రామాలయం, ఇస్కాన్ మందిరం, కపిలతీర్థం, శ్రీనివాస మంగాపురం వంటి ఆలయాలకు వెళ్లాలంటే రూ.వందల్లో వసూలు చేస్తున్నారు. ధరలపై ట్రాఫిక్ పోలీసుల నియంత్రణ లేకపోవడం, సంఘాల నేతల పెత్తనంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

గరుడసేవకు వాహనాలపై ఆంక్షలు

● నేటి రాత్రి నుంచే ద్విచక్ర వాహనాలు, ట్యాక్సీల రాకపోకలు నిలిపివేత

తిరుపతి (నేరవిభాగం, బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో అత్యంత విశేషమైన గరుడ వాహన సేవను పురస్కరించుకుని ముందురోజు నుంచే ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు ప్రకటించారు. తిరుమలలో ఎనిమిది వేల వాహనాల పార్కింగ్‌కు మాత్రమే అవకాశం ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈనెల 7వ తేదీ రాత్రి తొమ్మిది గంటల నుంచి ఈనెల 9న ఉదయం వరకు ఘాట్ రోడ్డులో ద్విచక్ర వాహనాలు, ఎల్లో బోర్డు (ట్యాక్సీ) వాహనాలు నిషేధించినట్లు పేర్కొన్నారు.

■ **తొమ్మిది పార్కింగ్ కేంద్రాలు:** గరుడసేవ రోజు తిరుమలలో ఎనిమిదివేల వాహనాల పార్కింగ్ సామర్థ్యం చేరుకున్నాక సొంత వాహనాలను అనుమతించరు. కడప, శ్రీకాళహస్తి నుంచి వచ్చే వాహనదారులు కరకంబాడి సమీపంలోని ఎస్వీసీ ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఆపాలి. పుత్తూరు మార్గం నుంచి వచ్చే భక్తులు శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలో పార్కింగ్ చేసుకోవాలి. చిత్తూరు, పీలేరు వైపు నుంచి వచ్చే వాహనాలు దేవ్‌లోక్, భారతీయ విద్యాభవన్ మైదానంలో వాహనాలు నిలపాలి. ద్విచక్ర వాహనదారులు ఇస్కాన్, నెహ్రూ మున్సిపల్ స్కూల్ మైదానం సద్వినియోగం చేసుకోవాలి. వీటితోపాటు సింధు, తనపల్లి, ఆర్సీపురం, నంది కూడళ్ల వద్ద వాహనాలు పార్కింగ్ చేసుకోవచ్చు. ప్రతి పార్కింగ్ కేంద్రం వద్ద భక్తులు తిరుమలకు వెళ్లడానికి వీలుగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశారు.

ముందస్తుగా మద్యం దరఖాస్తులు చేసుకోండి

- ● లాటరీలో అదనంగా ఇద్దరి ఎంపిక
- ● ఉమ్మడి చిత్తూరు జిల్లా డీసీ విజయశేఖర్

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: చివరిరోజైన 9వ తేదీ అత్యధికంగా దరఖాస్తులు నమోదుకు అవకాశం లేకుండా ఈనెల 7, 8 తేదీల్లోనే మద్యం దుకాణాల నిమిత్తం దరఖాస్తులు చేసుకోవాలని ఉమ్మడి చిత్తూరు జిల్లాల ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ పిలుపునిచ్చారు. ఆదివారం తిరుపతి అర్బన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. తిరుపతి జిల్లాలో 227.. చిత్తూరు జిల్లాలో 104 మద్యం దుకాణాల కేటాయింపునకు టెండర్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులను అడ్డుకోవడం.. బెదిరించడం వంటి ఘటనలకు అవకాశం లేకుండా మూడు పద్ధతుల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 11న తిరుపతి జిల్లాకు సంబంధించి శిల్పారామం.. చిత్తూరుకు సంబంధించి షుగర్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో ఆయా కలెక్టర్లు లాటరీ తీసి ఎంపిక చేస్తారన్నారు. ప్రతి దుకాణానికి లాటరీలో ఒకరిని ఎంపిక చేసిన తర్వాత.. మరో ఇద్దరిని రిజర్వుగా ఎంపిక చేస్తామని, ఎంపికైన వ్యక్తి డబ్బు కట్టకపోతే తరువాత వారికి కేటాయిస్తామన్నారు. అనుమానాల నివృత్తికి టోల్‌ఫ్రీ నెంబరు 04042425520ను సంప్రదించాలని డీసీ కోరారు. ఈఎస్ నాగమల్లీశ్వరరెడ్డి, ఏఈఎస్ వాసుదేవ చౌదరి, సీఐలు రామచంద్ర, నరసానాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎక్సైజ్ డీసీ విజయశేఖర్ తదితరులు

తిరుమలలో దుకాణదారులపై చర్యలు



లేపాక్షి పక్కన ఉన్న దుకాణాన్ని మూసివేయిస్తున్న అధికారులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాను పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు దుకాణదారులు అధిక ధరలకు విక్రయించడం, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో పరిశుభ్రత పాటించకపోవడం వంటివాటిపై తిరుమల రెవెన్యూ విభాగం అధికారులు చర్యలు చేపట్టారు. ఆదివారం తితిదే ఎస్టేట్ అధికారి వెంకటేశ్వర రావు, ఏఈవో నారాయణ చౌదరి, టాస్క్‌ఫోర్ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. రెండు టీ దుకాణాలు, రెండు ఫ్యాన్సీ షాపులను సీజ్ చేశారు. గోవర్ధన్ సత్రం వద్ద తితిదే కేటాయించిన స్థలాల కంటే ఎక్కువ ఆక్రమించుకుని అపరిశుభ్ర వాతావరణంలో నిర్వహిస్తున్న ఐదు ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు సీజ్ చేశారు. పీఏసీ-1 వద్ద ఎక్కువ స్థలం ఆక్రమించుకుని వ్యాపారం నిర్వహిస్తున్న మూడు హాకర్ లైసెన్సులను తాత్కాలికంగా స్వాధీనం చేసుకున్నారు. డీఎంబీ రోడ్డులో భక్తులకు అడ్డంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి హెచ్చరికలు జారీచేశారు.

ఆర్థిక లావాదేవీల నేపథ్యంలోనే బాలిక హత్య

తల్లీకూతురితోపాటు బాలుడి అరెస్టు ◆ అస్వియా హత్య కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ, కలెక్టర్

పుంగనూరు గ్రామీణ: ఆర్థిక లావాదేవీల నేపథ్యంలోనే పుంగనూరులో బాలిక అస్వియా (7) హత్య జరిగిందని ఎస్పీ మణికంఠ చందోలు పేర్కొన్నారు. ఏడు రోజులుగా నెలకొన్న ఉత్కంఠకు తెరదించినట్లు తెలిపారు. నిందితులు బాధితుడైన అజ్మతుల్లా ఇంటికి కేవలం వంద మీటర్ల దూరంలో నివసిస్తున్న తల్లీకుమార్తె, ఓ బాలుడని.. వారిని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. హత్య కేసు వివరాలను కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి సర్కిల్ కార్యాలయంలో ఆదివారం వెల్లడించారు.

■ **అభ్యంతరకరంగా మాట్లాడటంతోనే..:** 'అస్వియా తండ్రి అజ్మతుల్లా వడ్డీ వ్యాపారి. తన వద్ద నగదు తీసుకుని సమయానికి ఇవ్వని వారిని అసభ్యకరంగా మాట్లాడేవారు. అజ్మతుల్లా ఇంటికి వంద మీటర్ల దూరంలో నివసిస్తున్న హసీనా, ఆమె కుమార్తె రేష్మ ఇంటి నిర్మాణానికి అజ్మతుల్లా వద్ద రూ.3.50 లక్షల నగదు వడ్డీకి తీసుకున్నారు. ఈ మొత్తం గడువుమీరినా ఇవ్వకపోవడంతో ఫోన్ చేసి గట్టిగా మాట్లాడేవారు. దీన్ని వారు అవమానంగా భావించి అతనిపై కక్ష పెంచుకున్నారు. గత నెల 29న అస్వియాను అపహరించారు' అంటూ ఎస్పీ తెలిపారు.

■ **చాక్లెట్, భోజనం పెట్టి.. ముక్కుమూసి హత్య:** 'నిందితురాలు రేష్మ బురఖా ధరించి బాలికకు చాక్లెట్ ఇచ్చి ఇంటికి తీసుకెళ్లి భోజనం పెట్టారు. కొద్దిసేపటికే బాలిక ఇంటికి వెళ్లాలని ఏడ్చింది. బయటకు వినిపిస్తే ఇబ్బంది అవుతుందనే అనుమానంతో ఓ బాలుడిని కాపలా పెట్టి నిందితులు బాలిక ముక్కు, నోరు మూయడంతో శ్వాస అందక మృతి చెందింది'. 'ఆ సమయంలో బాలిక పెనుగులాడిందని.. రేష్మను బాలిక చేతి గోర్లతో రక్కిన గుర్తులున్నాయి. మృతదేహాన్ని రేష్మకు తమ్ముడి వరసయ్యే బాలుడి సాయంతో ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి ట్యాంకులో విసిరేశారు' అంటూ ఎస్పీ వివరించారు. సమావేశంలో డీఎస్పీలు సాయినాథ్, ప్రభాకర్, సీఐలు శ్రీనివాసులు, సీఐ భాస్కర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ, చిత్రంలో కలెక్టర్ సుమిత్ కుమార్, డీఎస్పీ, వైద్యాధికారి

అత్యుత్సాహం తగదు: కలెక్టర్

ఈ కేసును కొన్ని పత్రికలు, టీవీలు హత్యాచారంగా చూపుతూ ప్రచారం చేశాయని.. మొత్తంగా బాలిక హత్య ఘటనపై అత్యుత్సాహం చూపారని కలెక్టర్ సుమిత్‌కుమార్ అసహనాన్ని వ్యక్తం చేశారు. ఇలా ప్రవర్తించిన మీడియాపై ఎందుకు కేసులు నమోదు చేయకూడదని ప్రశ్నించారు. ● అస్వియా పోస్టుమార్టం నివేదికలో హత్యాచారం జరగలేదని తేలిందని పుంగనూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్యాధికారి మధుసుదనాచారి తెలిపారు. ఎక్కడా గాయాలు, ఇతర ఆనవాళ్లు లేవన్నారు. ల్యాబ్ రిపోర్టు వచ్చిన అనంతరం నివేదిక వెల్లడిస్తామన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎంపీ అప్పలనాయుడు

నారావారిపల్లెలో ఎంపీ అప్పలనాయుడు

చంద్రగిరి గ్రామీణ: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వగ్రామం నారావారిపల్లెను సందర్శించడం ఆనందంగా ఉందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఆదివారం నారావారిపల్లెకు చేరుకున్న అప్పలనాయుడుకి సర్పంచి బొబ్బలక్ష్మి, ఉప సర్పంచి రాకేష్‌చౌదరి, చంద్రబాబునాయుడు తమ్ముడు వరుసైన నారా సుబ్రహ్మణ్యం నాయుడు స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబునాయుడు స్వగృహాన్ని పరిశీలించి వారి తల్లిదండ్రుల సమాధులకు, ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు మునిరత్నం నాయుడు, బొబ్బ గిరినాయుడు పాల్గొన్నారు.